గురువారం
3-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 191
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

వక్ఫ్‌పై దద్దరిల్లిన లోక్‌సభ

- అధికార-ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల తూటాలు
- రాజ్యాంగానికి విరుద్ధం- ముస్లింల హక్కులకు విఘాతం: 'ఇండియా'
- అవినీతిని అరికట్టేందుకు కఠిన చట్టాలుండాలి: అమిత్‌షా

న్యూఢిల్లీ: కేంద్రంలోని నియంతృత్వ మోదీ సర్కారు పంతం నెగ్గించుకుంది. పార్లమెంటు లోపల, వెలుపలా సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటు ముందుకు తెచ్చింది. ఇండియా ఐక్యసంఘటన ఎంపీల తీవ్ర నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి, చర్చను ప్రారంభించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని, ఈ బిల్లును తీసుకురాకపోతే... పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతే స్థాయి దీటుగా స్పందించిన 'ఇండియా' ఎంపీలు వక్ఫ్ సవరణ బిల్లు దేశ లౌకిక వ్యవస్థను దెబ్బతీసే చర్య అంటూ విమర్శించారు. ఈ బిల్లుపై చర్చకు ఎనిమిది గంటలు కేటాయించగా... చివరిలో రాత్రి పది గంటల వరకు పొడిగించారు. ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని మోదీ సర్కారు పట్టుదలతో ఉండగా ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకిస్తుండటంతో పార్లమెంటులో రెండు పక్షాల మధ్య మాటలయుద్ధమే సాగింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఎంఐఎం సహా ఇండియా ఐక్య సంఘటన పార్టీలన్నీ వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాయి. 'ప్రజాస్వామిక విలువలను మంటగలుపుతూ మేము వ్యతిరేకిస్తున్నాగానీ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిని ప్రతిపక్షాలు, లౌకిక పార్టీలు ఐక్యంగా అడ్డుకోవాలి' అని ముస్లిం నేతలు కోరారు. ఈ బిల్లు ముస్లింల సాధికారతను హరించేందుకు, మైనారిటీలను విభజించే యత్నమని దుయ్యబట్టారు. వాస్తవానికి గతేడాది ఆగస్టులోనే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు కేంద్రం పంపింది. కొన్ని ప్రతిపాదనలతో ఈ బిల్లును జేపీసీ ఆమోదించింది. ఇప్పుడు మళ్లీ ఇది లోక్‌సభ ముందుకు వచ్చింది. ముస్లింల హక్కులను హరించే విధంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా వక్ఫ్ (సవరణ) బిల్లును తెచ్చారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. మతానికి సంబంధించిన న్యాయ సిద్ధాంతాలపై దాడిగా ఈ బిల్లును అభివర్ణించారు. ఓ వర్గానికి కాదు తమ కార్పొరేట్ మిత్రులకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రం వక్ఫ్ బిల్లును తెచ్చిందని వ్యాఖ్యానించారు. ఇది నిరంకుశ చట్టమని, రాజ్యాంగానికి విరుద్ధమని విమర్శించారు. వక్ఫ్ భూములను స్వాహా చేయాలనే కేంద్రం ఈ బిల్లు తెచ్చిందని దుయ్యబట్టారు. బీజేపీ ఓ జుమ్లా పార్టీ అని, ఈ చట్టం ద్వారా మతం పేరిట దేశాన్ని విభజించాలని చూస్తోందని ఎంపీలు మండిపడ్డారు. భారత్‌లో సంఘ్ పరివార్ గోప్య అజెండా అమలే వక్ఫ్ బిల్లు వెనుక ఉద్దేశమని విమర్శించారు. భవిష్యత్‌లో ఆలయాల భూములను కేంద్రం హరిస్తుందని హెచ్చరించారు. 'ప్రభుత్వ సంఘాల ద్వారా వక్ఫ్ ఆస్తుల కబ్జా కోసమే వక్ఫ్ బిల్లు. ప్రతిపాదిత మార్పుల అవసరం లేదు. వక్ఫ్ ఆస్తులు ముస్లింలకు వెన్నుదన్ను' అని ప్రతిపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ విధానాలు, ఉద్దేశాలు ఎప్పుడూ సరిగ్గా ఉండవని, కోట్లాది మంది దేశ ప్రజల ఇళ్లు, దుకాణాలను హరించేందుకు కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఇదిలావుంటే, వక్ఫ్ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమర్థించారు. దేశానికి చెందిన చట్టాన్ని ప్రతి ఒక్కరు అంగీకరించాల్సిందేనన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకును రక్షించుకోవాలని చూస్తోందని, ఈ బిల్లు ద్వారా వక్ఫ్ ఆదేశాలను కోర్టుల్లో సవాల్ చేయవచ్చని అన్నారు. మతాల మధ్య ఘర్షణ సృష్టించే ఉద్దేశం తమకు లేదని చెప్పారు. దేశానికి కఠిన చట్టాల అవసరమని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ గతంలో చెప్పడాన్ని అమిత్‌షా గుర్తుచేశారు. ఈ బిల్లు అవినీతికి తప్ప ఏ మతానికీ వ్యతిరేకం కాదని అన్నారు. వక్ఫ్

- మిగతా 2 లో

రిజర్వేషన్లు సాధిస్తాం

- బీసీలను బలపర్చాలనే ఆలోచనకు బీజేపీ వ్యతిరేకం
- దామాషా ప్రకారం నిధులు... నియామకాలు
- తెలంగాణలో కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చాం
- 'ఢిల్లీ' గర్జనలో సీఎం రేవంత్

విశాలాంధ్ర–హైదరాబాద్: దామాషా ప్రకారం నిధులు, నియామకాలు ఉండాలనే ఉద్దేశంతోనే తెలంగాణలో కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రిజర్వేషన్లు పెంచడం కేంద్ర పరిధిలోని అంశమని, తెలంగాణలో రిజర్వేషన్లు పెంచేందుకు మోదీకి ఉన్న ఇబ్బంది ఏంటని నిలదీశారు. ఢిల్లీలో బుధవారం జరిగిన బీసీ గర్జన సభలో ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ స్ఫూర్తితోనే కుల గణన చేపట్టడమే కాకుండా బీసీలకు రిజర్వేషన్ల పెంపు తీర్మానం చేశామన్నారు. చట్టసభల్లో

- మిగతా 2 లో

బీసీలకు మోదీ అన్యాయం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: బీసీలకు మోదీ అన్యాయం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. తాను బీసీ అని చెప్పుకుంటున్న మోదీ... బీసీలకు ఎందుకు న్యాయం చేయలేకపోతున్నారని నిలదీశారు. ఢిల్లీలో

- మిగతా 2 లో

బర్డ్‌ఫ్లూతో చిన్నారి మృతి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రంలో తొలి బర్డ్‌ఫ్లూ వైరస్ మరణం నమోదైంది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో చిన్నారి (2) బర్డ్‌ఫ్లూ హెచ్5ఎన్1 వైరస్‌తో మరణించినట్టుగా భారత వైద్య పరిశోధన మండలి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నిర్ధారించింది. చిన్నారి మృతితో ప్రభుత్వం అప్రమత్తమైంది. చిన్నారి ఇంటి చుట్టుపక్కల ఆరోగ్యశాఖ సిబ్బంది సర్వే చేశారు. అనుమానిత లక్షణాలున్న వారెవరూ లేరని నిర్ధారించారు. ఇంట్లో చికెన్ కర్రీ వండుతున్న సమయంలో పాప అడిగిందని పచ్చిమాంసం ముక్క చిన్నది పెట్టామని, దానివల్ల మా పాప మరణానికి కారణం

- మిగతా 2 లో

లాలూకు తీవ్ర అస్వస్థత... ఢిల్లీ తరలింపు

పాట్నా: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితి బుధవారం ఉదయం క్షీణించడంతో వైద్య పరీక్షలు, చికిత్స కోసం హుటాహుటిన ఢిల్లీకి తరలించారు. లాలూ వెంట కుమారుడు, బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ కూడా ఢిల్లీ వెళ్లారు. లాలూ ప్రసాద్ యాదవ్ గత కొంతకాలంగా తీవ్ర మధుమేహంతో బాధపడుతున్నారు. పాట్నాలో సాధారణ వైద్య పరీక్షలు, చికిత్స చేయించారు. అయినప్పటికీ లాలూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఢిల్లీకి బయలుదేరిన

- మిగతా 2 లో



జపాన్‌లో భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 6.0గా నమోదు

టోక్యో: జపాన్‌లోని క్యుషులో 6.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. బుధవారం సాయంత్రం 7:34 గంటలకు రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రతతో కూడిన శక్తివంతమైన భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) తెలిపింది. అయితే గణనీయమైన నష్టం లేదా ప్రాణనష్టం జరిగినట్లు ఎటువంటి నివేదికలు లేవు. అధికారులు అనంతర ప్రకంపనలను పర్యవేక్షిస్తున్నారు. భూకంప ప్రభావాన్ని అంచనా వేస్తున్నారు. నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, భద్రత కోసం ఉత్తమ పద్ధతులను అనుసరించాలని అధికారులు సూచించారు. మార్చి 26న

- మిగతా 2 లో

హిందూత్వ నయా ఫాసిజంతో దేశానికి ముప్పు

- దీనిని ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి వామపక్షాలదే
- సీపీఎం జాతీయ మహాసభల్లో నేతల ఉద్ఘాటన
- వామపక్ష, లౌకికశక్తులు ఐక్యం కావాలని పిలుపు

మధురై: భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశంలోని అన్ని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యం కావాలని నేతలు పిలుపునిచ్చారు. సీపీఎం 24వ జాతీయ మహాసభలు తమిళనాడులోని సీతారాం ఏచూరి నగర్ (మధురై)లో బుధవారం ప్రారంభమయ్యాయి. కామ్రేడ్ కొడియేరి బాలకృష్ణన్ ఆడిటోరియంలో జరిగిన ఈ ప్రారంభ సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన సీపీఎం పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ... జాతీయ, అంతర్జాతీయ అంశాలను ప్రస్తావించారు. అన్ని లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో చేతులు కలిపి పనిచేయడానికి సీపీఎం తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్టు కరత్ ప్రకటించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల మధ్య నెలకొనే ఇటువంటి విస్తృత ఐక్యతే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులకు వ్యతిరేకంగా విజయవంతమైన పోరాటాలకు దోహదం చేస్తుందని చెప్పారు. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి, వామపక్ష రాజకీయ జోక్యాన్ని విస్తృతం చేయడానికి ఇది సరైన సమయమని ఆయన చెప్పారు. 'నయా ఉదారావాద, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా, శ్రామిక ప్రజల ప్రయోజనాలను వామపక్షాలు మాత్రమే దృఢంగా కాపాడతాయన్నారు. దేశానికి ప్రమాదకరంగా మారిన హిందూత్వ నయా ఫాసిజాన్ని ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి ఒక్క వామపక్షాలకు మాత్రమే ఉందని కరత్ చెప్పారు. మన దేశంపై సామ్రాజ్యవాద దాడులను వామపక్షాలు కూడా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదంతో సన్నిహిత స్నేహం ఉన్న హిందూత్వ–కార్పొరేట్ కూటమికి ప్రతినిధులని ప్రకాశ్ కారత్ వివరించారు. డొనాల్డ్ ట్రంప్‌కు స్నేహితుడినని ఎవరు చెప్పుకుంటున్నారు? గౌతమ్ అదానీ మరియు ముఖేష్ అంబానీలకు సన్నిహిత స్నేహితుడు ఎవరు? ఆర్‌ఎస్‌ఎస్‌కు పూర్తిగా విధేయులు ఎవరు? అను మూడు ప్రశ్నలకు 'నరేంద్ర మోదీ, బీజేపీ' అనే ఒకే సమాధానం వస్తుందని కరత్ అన్నారు. మూడవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్

- మిగతా 2 లో

కంచ గచ్చిబౌలి భూముల్లో

పనులు ఆపండి: హైకోర్టు

విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర – హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో బుధవారం వాదనలు కొనసాగాయి. ఆ భూముల్లో పనులు ఆపాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరపున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. 'గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇస్తున్నట్టు పేర్కొంది. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. భూముల్లో చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలన్నా... వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలన్నా నిపుణుల కమిటీ పర్యటించి నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు, రాక్స్, ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి' అని కోర్టుకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున

- మిగతా 2 లో

విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకం

తల్లి మృతి, కుమార్తె పరిస్థితి విషమం

విశాలాంధ్ర–పీఎం పాలెం (విశాఖపట్నం): తన ప్రేమను తిరస్కరించిందన్న ఆగ్రహంతో మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వయంకృషి నగర్‌లో ఓ యువతిని, అడ్డొచ్చిన ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా... కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం జిల్లా పుర్లి గ్రామానికి చెందిన నక్కా దీపిక (20) విశాఖపట్నంలో డిగ్రీ

- మిగతా 2 లో

ఏపీలో ఇంటి వద్దే 47 రకాల వైద్య పరీక్షలు

ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

108, 104 సేవలకు కొత్త సర్వీస్ ప్రొవైడర్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో ఇప్పటి వరకూ సమస్యాత్మకంగా కొనసాగుతున్న 104, 108 సేవలకు జవసత్వాలు కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సేవలను అందిస్తున్న ప్రస్తుత సర్వీస్ ప్రొవైడర్ స్థానంలో ప్రభుత్వం కొత్త ఏజెన్సీని గుర్తించింది. ఈ ప్రక్రియలో భాగంగా దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల ఆరోగ్య స్థితి నిర్ధారణకు 47 రకాల వైద్య పరీక్షలను 104 వాహనాల ద్వారా ఉళ్లల్లోనే ప్రజలకు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సారథ్యంలో ఎస్‌ఆర్‌ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను భాగస్వామిగా ఉన్న కన్సార్షియంను ఇక నుంచి ఈ సేవలను అందించే ఏజెన్సీగా టెండరు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆరోగ్య స్థాయి వివరణాత్మక ప్రొఫైలింగ్ ద్వారా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను (ఈహెచ్‌ఆర్) రూపొందించడానికి ఈ పరీక్షలను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా రాష్ట్రంలో ప్రస్తుత , భవిష్యత్తు వ్యాధుల భారాన్ని అంచనా వేయడం వీలవుతుంది. తద్వారా అవసరాలకనుగుణంగా ప్రభుత్వం తగు చర్యలను చేపట్టడానికి మార్గం ఏర్పడుతుంది. ప్రస్తుతం 104 అంబులెన్స్‌ల ద్వారా కేవలం మధుమేహం మరియు బీపీ వ్యాధులను గుర్తించడానికి మాత్రమే 'ర్యాపిడ్ కిట్' పరీక్షలు చేస్తున్నారు. దీనికి భిన్నంగా నూతన విధానంలో నిర్దిష్ట ఫలితాలనిచ్చే 47 రకాల పరీక్షలు చేయడం జరుగుతుంది. బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్, రీనల్ ఫంక్షన్ టెస్టులు, లివర్ ఫంక్షన్ టెస్టులు, కంప్లీట్ లిపిడ్ ప్రొఫైల్, యూరిన్ అనాలిసిస్, ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్‌లకు సంబంధించి 20 పరీక్షలు లబ్ధిదారులకు

- మిగతా 2 లో

15 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి

ఎస్‌ఎల్‌బీసీ మృతుల కుటుంబాలకు త్వరలో నష్టపరిహారం: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర – హైదరాబాద్: ఎస్‌ఎల్‌బీసీలో మరో 15 రోజులలో సహాయక చర్యలు పూర్తవుతాయని, నల్లగొండ, ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే కృష్ణానదీ జలాలు మరో రెండున్నర సంవత్సరాలలో అందుబాటులోకి వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శ్రీశైలం ఎడమ కాలువగట్టు టన్నెల్ ప్రమాదస్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు టన్నెల్‌లో సహాయక చర్యలు వేగంగా సాగుతున్నాయన్నారు. మరో 110 మీటర్ల మేర తవ్వకాలు పూర్తయితే సమస్య ఓ కొలిక్కి

- మిగతా 2 లో

శవాల దిబ్బగా మైన్మార్

2లో

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 5

చండ్ర రాజేశ్వరరావు

ఒక వ్యక్తి చూపులకు, గుణగణాలకు, స్వభావానికి సంబంధం ఉండనక్కర్లేదనడానికి చండ్ర రాజేశ్వరరావు మంచి ఉదాహరణ. ఆయనది ఎత్తైన విగ్రహం. విశాలమైన ముఖం. గంభీరమైన గొంతు. ఆ పంచె కట్టు, నడిచే తీరు, మాటలో ఓ రకమైన కరకుదనం ఆయనలోని నిశిత దృష్టిని, మేధో శక్తిని, మానవీయ లక్షణాలను కప్పి పెట్టేవి.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ఇదీ లోకం!

ప్రాణాల కన్నా లాభాలు ముఖ్యమా?

బొగ్గు గనిలో ప్రమాదంపై కమ్యూనిస్ట్ వర్కర్స్ పార్టీ ఆఫ్ స్పెయిన్ ఆగ్రహం

బెర్లిన్: ఉత్తర స్పెయిన్‌లోని ఆస్టురియాస్ ప్రాంతంలోని డెగానా బొగ్గు గనిలో ప్రమాదం జరిగి ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై కమ్యూనిస్ట్ వర్కర్స్ పార్టీ ఆఫ్ స్పెయిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాలకు, మృతుల సహచరులు, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో నలుగురు కార్మికులకూ మద్దతు తెలిపింది. ఈ ఘటన ఎలా జరిగిందన్న దర్యాప్తు జరిగేంత వరకు ఆగడం సముచితమే అయినప్పటికీ ఐదుగురి ప్రాణాలు పోతే స్పందించకుండా మౌనంగా ఎలా ఉండగలమని బుధవారం ఓ ప్రకటనలో అసహనం వ్యక్తంచేసింది. కార్మికుల భద్రత కోసం యాజమాన్యాలు తీసుకునే చర్యలు తగ్గిపోతున్నాయని ఆవేదన చెందింది. మీకు లాభాలు ముఖ్యమా లేక కార్మికుల ప్రాణాలా అంటూ నిలదీసింది. ఇలాంటి ఘటనలు ఎప్పుడు జరిగినాగానీ కమ్యూనిస్టు పార్టీ ఆక్షేపిస్తూనే ఉంటుందని గుర్తుచేసింది.

సంవత్సరాలుగా కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించే చర్యల కోసం డిమాండ్ చేస్తోందని తెలిపింది. ఇప్పటికైనా మైనర్ల ప్రాణాలకు భద్రత కల్పించేలా సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని కమ్యూనిస్టు పార్టీ నొక్కిచెప్పింది. టెక్నికల్ స్టాఫ్‌ను తగ్గించడం, మైనింగ్ పరిస్థితులను, సదుపాయాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇలాంటివి జరుగుతున్నాయని పేర్కొంది. పని పరిస్థితులను మెరుగుపర్చాలని డిమాండ్ చేసింది. 'మేము పనికి వస్తున్నది కడుపు నింపుకోవడం కోసమే తప్ప ప్రాణాలు కోల్పోవడానికి కాదు' అంటూ కార్మికుల తరపున నినాదమిచ్చింది. సమ్మెలు, తీర్మానాలు చేస్తే సరిపోదు... శ్రామిక వర్గానికి సముచిత భద్రత కోసం తక్షణ చర్యలకు హామీనిచ్చేలా పోరాడాలని కమ్యూనిస్ట్ వర్కర్స్ పార్టీ ఆఫ్ స్పెయిన్ పిలుపునిచ్చింది.

సైప్రస్‌లో వలసవాద వ్యతిరేక పోరు మొదలై 70 ఏళ్లు

నికోసియా: సైప్రస్‌లో బ్రిటిష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం మొదలై 70 ఏళ్లు అయ్యాయి. ఈ సందర్భంగా అమర యోధులకు ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ (ఏకేఈఎల్) విప్లవాంజలి ఘటించింది. బ్రిటిష్ వలసవాద పాలనకు ముగింపు పలికే లక్ష్యంతో 1955, ఏప్రిల్ 1న పోరాటం ప్రారంభమైందని బుధవారం ఒక ప్రకటనలో ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ గుర్తుచేసింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సైప్రస్ వీరులను కీర్తించింది. వీరోచితంగా, సాహసోపేతంగా తమ మాతృభూమి స్వాతంత్ర్యం కోసం పోరాటి...ప్రాణాలు అర్పించిన యోధులకు జోహార్లు. ఎన్నో వేధింపులను తట్టుకున్నారని వలసవాద పాలకులకు వ్యతిరేకంగా పోరాడారంటూ శ్లాఘించింది. బ్రిటిష్ పాలన కాలాన్ని ఒక చీకటి శకంగా అభివర్ణించింది. నేటికీ సైప్రస్‌పై బ్రిటిష్ ఆధిపత్యం ఉందని తెలిపింది. దేశంలో బ్రిటిష్ స్థావరాలు ఏర్పాడ్డాయని, వాటిని ఇప్పుడు గాజాలో మారణహోమం సృష్టించడం కోసం యద్దేచ్ఛగా వాడుతున్నారని తెలిపింది. ఈ క్రమంలో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడం అత్యవసరమే కాదు సమయానుచితమని ఏకేఈఎల్ నొక్కిచెప్పింది.

శవాల దిబ్బగా మైన్మార్

తవ్వేకొద్దీ బయటపడుతున్న మృతదేహాలు

నేపీడా: గతవారం సంభవించిన భారీ భూకంపంతో మైన్మార్‌లో పరిస్థితులు భయానకంగా మారాయి. శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయి ఉండటంతో తవ్వే కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. దీంతో మైన్మార్ శవాల దిబ్బగా మారింది. రోజులు గడుస్తున్న కొద్దీ శిథిలాల కింద చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటపడతారన్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఓ వైపు అంతర్యుద్ధం, మరోవైపు భూకంపం కారణంగా మైన్మార్‌లో పరిస్థితులు దారుణంగా మారాయి. దీంతో మానవతా సాయానికి ఆటంకం కలుగుతోంది. ఈ క్రమంలో బాధితులకు నిరాటంకంగా మానవతా సాయాన్ని అందనివ్వాలని జుంటా ప్రభుత్వానికి మానవ హక్కుల సంఘాలు విన్నవించాయి. ఆ మేరకు మైన్మార్ పాలకులపై ఒత్తిడి తేవాలని కూడా అంతర్జాతీయ సంఘాలకు పిలుపునిచ్చాయి. సహాయక చర్యలు బుధవారం కూడా కొనసాగాయి. ఇప్పటివరకు 2,886 మరణించినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. గాయపడిన వారి సంఖ్య 4,639గా ఉంటే 373 మంది ఆచూకీ లేరని మీడియా నివేదికలు వెల్లడించాయి. పక్క దేశమైన థాయిలాండ్‌నూ భూకంపం కుదిపివేయగా... అక్కడి మృతుల సంఖ్య 22కు పెరిగింది. మరో 72 మంది ఆచూకీ లేరు. కొన్ని వందల భవనాలు కూలిపోయాయి. భూకంప ప్రభావిత ఆరు ప్రాంతాల్లో 2.8 కోట్ల మందికిపైగా బాధితులు ఉన్నారని ఐక్య రాజ్య సమితి (ఐరాస) వెల్లడించింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు 12 మిలియన్ డాలర్లు కేటాయించినట్లు తెలిపింది. ఆహారం, ఆశ్రయం, నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం తదితరాలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. 1.5 మిలియన్ యువాన్ల ఆర్థిక సాయాన్ని మైన్మార్‌కు చైనా అందించింది.

బర్డ్‌ఫ్లూతో చిన్నారి మృతి

(మొదటిపేజీ తరువాయి)

అవుతుందనుకోలేదని ఆమె తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఉడికించిన మాంసం తిన్న తమకు ఏమీ కాలేదని అధికారులకు తెలిపారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతోనే చిన్నారి మరణానికి దారితీసిందని వైద్యుల వెల్లడించారు. రాష్ట్రంలో ఇదే బర్డ్‌ఫ్లూ మృతి తొలి కేసు అని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ హెచ్చరించింది. జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, మూర్ఛ, విరేచనాలు, ఆహారం తినలేని లక్షణాలతో గత నెల నాలుగో తేదీన మంగళగిరి ఎయిమ్స్‌లో చిన్నారిని ఆమె కుటుంబసభ్యులు చేర్చారు. వైద్యులు... ఆక్సిజన్ సాయంతో చిన్నారికి చికిత్స అందించినప్పటికీ, 16వ తేదీన తుదిశ్వాస విడించింది. చికిత్స సమయంలో మార్చి ఏడున పాప గొంతు, ముక్కు నుంచి తీసిన స్వాబ్ నమూనాలను ఎయిమ్స్ వీఆర్డీఎల్లో పరీక్ష చేయించగా.. బర్డ్ ఫ్లూ వైరస్ అనే అనుమానం రావడంతో, ఆ శాంపిళ్లను 15న దిల్లీకి పంపించారు. అక్కడ నివేదిక కూడా బర్డ్‌ఫ్లూనేమోనని అనుమానం రావడంతో ఐసీఎంఆర్ అప్రమత్తమైంది. 24న స్వాబ్ నమూనాలను పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ వైరాలజీకి పంపించింది. దీంతో ఈ రెండు ల్యాబ్‌లలో నమూనాలను క్షుణ్ణంగా పరీక్షించగా చిన్నారికి హెచ్5ఎన్1 వైరస్‌గా నిర్ధారించారు.

లాలూకు తీవ్ర అస్వస్థత...

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఆయన చేతికి బ్యాండేజీ ఉండటం కనిపించింది. లాలూ ప్రసాద్ యాదవ్ దిల్లీలో సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకోనున్నారు. వైద్యులు ఆయన బ్లడ్ షుగర్ స్థాయిలను, ఇతర ఆరోగ్య సూచికలను నిశితంగా పరిశీలించనున్నారు. గతంలో కూడా ఆయన వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా ఎయిమ్స్ దిల్లీ వైద్యులతో సంప్రదింపులు జరిపారు. ఆరోగ్య పరీక్షలు, చికిత్స కోసం ఆయన అనేకమార్లు దిల్లీకి వెళ్లారు. 2022లో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆయన కుమార్తె రోహిణి ఆచార్య కిడ్నీని దానం చేశారు. 2024 సెప్టెంబరులో ముంబైలో యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. 2014లో ముంబైలోని ఒక ఆసుపత్రిలో ఆయనకు ఓపెన్-హార్ట్ సర్జరీ జరిగింది. గత నెలలో లాలూ ప్రసాద్ యాదవ్ వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. మార్చి 26న ఆయన గార్దెనిబాగ్ వద్ద బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆయన బహిరంగంగా కనిపించలేదు. ఇదిలా ఉండగా, ఆర్జేడీ కార్యకర్తలు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.

2025లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులు ఆర్జేడీ ఎన్నికల వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మాజీ రైల్వే మంత్రిగా, బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌లో వివిధ కులాలు, వర్గాలపై మంచి పట్టు ఉన్న రాజకీయ నేతలలో ఒకరు. ఆయన పార్టీకి మార్గనిర్దేశం చేస్తూ ఉంటారు. ఆయన అనుమతి లేకుండా పార్టీ నాయకులు ఎటువంటి నిర్ణయం తీసుకోరు. లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పటికే మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పేరును ఎన్నికల ముందు పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు.

విశాఖలో ప్రేమోన్మాది ఘాతుకం

(మొదటిపేజీ తరువాయి)

చదువుతోంది. కొంతకాలంగా నవీన్ అనే ఓ యువకుడు ఆమెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అయితే దీపిక అతడి ప్రేమను తిరస్కరించింది. దీంతో కక్ష పెంచుకున్న యువకుడు బుధవారం ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో దీపిక తల్లి నక్కా లక్ష్మి (43) ఘటనాస్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన దీపికను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. దీపిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగర పోలీస్ కమిషనర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించండి: చంద్రబాబు

ప్రేమోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో యువతి తల్లి లక్ష్మి ప్రాణాలు కోల్పోవడం విచారకరం అన్నారు.

బాధితురాలికి మెరుగైన వైద్యం: అనిత

ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీ శంఖబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడి... దీపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యువతికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను మంత్రి ఆదేశించారు.

నూతన ఆవిష్కరణల కేంద్రం ఏపీ

- ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌ల స్థాపనే లక్ష్యం
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వాములుకండి
- పారిశ్రామికవేత్తలు, మేధావులకు సీఎం చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ని తీర్చిదిద్దేందుకు, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామిక వేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలన్నారు. అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామని అన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్‌కు హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు. బుధవారం సచివాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' గురించి ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరికొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారతీయులు దేశవిదేశాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని... అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ హబ్ చేసినట్టుగానే, ఇప్పుడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనేది తన సంకల్పంగా చెప్పారు.గతంలో తమ ప్రభుత్వం పీ3 కార్యక్రమాన్ని చేపట్టిందని దాంతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని... ఈసారి జీరో పావర్టీ-పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

వచ్చే 5 ఏళ్లలో 20వేల స్టార్టప్‌లు

వచ్చే ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు ఏర్పాటు అయ్యేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు వస్తాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌గా అమరావతి ఉంటుంది. దీనికి గ్రూపు లీడర్‌గా టాటా గ్రూపు ఉంటుంది. ఎల్ అండ్ టీ, ఎంఎంఎస్ పార్టనర్లుగా వ్యవహరిస్తాయి. అమరావతి హబ్‌కు రాష్ట్రంలో 5 స్పోక్స్ అనుబంధంగా ఉంటాయి. స్పోక్స్ లీడ్ పార్టనర్లుగా అనంతపురానికి-జెఎస్‌డబ్ల్యు, తిరుపతికి-అదానీ గ్రూపు, విజయవాడకు-మేఘా గ్రూపు, రాజమహేంద్రవరానికి-గ్రీన్‌కో, విశాఖపట్నానికి-జీఎంఆర్ గ్రూపు వ్యవహరిస్తాయి. ఆర్టీఐహెచ్‌లో ఇంక్యుబేటర్, ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ సెంటర్, బ్యాంకింగ్ లింకేజ్, ట్రెనింగ్, వీసీ ఫండింగ్ హ్యాండ్ హెూల్డింగ్, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, హైపెర్స్కేలర్స్ కంప్యూటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మార్కెట్ లింకేజ్, రా మెటీరియల్ సోర్సింగ్ సపోర్ట్, ప్రోటోటైపింగ్ సెంటర్, బెట్ డేటింగ్ టెస్టింగ్ ట్రాక్స్, హైస్పీడ్ ఇంటర్నెట్ ఉంటాయని సీఎం వివరించారు. ప్రభుత్వ లక్ష్యానికను గుణంగా అందరూ సహకరించి ఏపీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని చంద్రబాబు కోరారు.

బీసీలకు మోదీ అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం జంతర్ మంతర్ వేదికగా జరిగిన బీసీ గర్జనలో నారాయణ మాట్లాడుతూ... బీసీల కోసం కొట్లాడిన కృష్ణయ్య బీజేపీ ఒడిలో చేరిపోయాడని విమర్శించారు. పనికిమాలిన రాజ్యసభ పదవి కోసం అమ్ముడుపోతాడా... అటువంటి నాయకుడు బీసీలకు న్యాయం చేస్తాడా..ఆయనను ఎవరు గుర్తిస్తారు... అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల ద్వారా బీసీలకు ఎంత ఇస్తారు అనేది కాదు పరిపాలనలో భాగస్వామ్యం, రాజకీయ హక్కులు కావాలని అన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ అర శాతం, ఒక్క శాతం ఉన్న వాళ్లకు కూడా న్యాయం జరగా లని పేర్కొన్న విషయాన్ని నారాయణ గుర్తు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలు బీసీ రిజర్వేషన్ కు సంపూర్ణ మద్దతు తెలియజేస్తు న్నాయన్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఉద్యమానికి, బీసీ రిజర్వేషన్ సాధించే విషయంలో కమ్యూనిస్టు పార్టీ బీసీలకు అండగా నిలబడుతుందని నారాయణ స్పష్టం చేశారు.

15 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని తెలిపారు. 250 మీటర్ల మేర రాయి, బంకమన్ను కారణంగా అడ్డంకి ఏర్పడిందన్నారు. 40 రోజులుగా వివిధ సంస్థలకు చెందిన సుమారు 800 మంది నిపుణులు పగలు రాత్రి అధికారుల పర్యవేక్షణలో పనిచేస్తున్నారన్నారు. అత్యాధునిక యంత్రాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇంతవరకు ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందేలా కలెక్టర్‌ను ఆదేశించినట్టు పేర్కొన్నారు. కాగా, మంత్రి పొంగులేటి సతీ సమేతంగా శ్రీశైలం భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దర్శనం చేసుకున్నారు.

'వక్ఫ్'పై దద్దరిల్లిన లోక్‌సభ

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు అతిపెద్ద సంస్కరణ... రాజ్యాంగ బద్ధమైనదని అమిత్‌షా తెలిపారు. దీనిపై విపక్షాలు ఉద్దేశపూర్వకంగా గందరగోళ పరిస్థితులు సృష్టిస్తూ ముస్లింలను భయపెడుతున్నాయని వ్యాఖ్యానించారు. వక్ఫ్ బోర్డులో ముస్లింయేతురులు ఎవరూ ఉండరన్నారు.

రిజర్వేషన్లు సాధిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్లు ... స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కొనసాగాలన్నా జనగణనలో కులగణన జరగాల్సిన అవసరం ఉందన్నారు. కుల గణన ఆధారంగా విద్య, ఉద్యోగ, ఉపాధిలో మాత్రమే కాకుండా రాజకీయ రిజర్వేషన్లు పెంచుతాం అని రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. మేం అధికారం చేపట్టిన వంద రోజులు తిరగకముందే బలహీనవర్గాల లెక్కలు తేల్చేందుకు శాసనసభలో తీర్మానం చేశామని తెలిపారు. ఏడాది తిరగకముందే కులగణన పూర్తి చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఫిబ్రవరి 4న చట్టసభల్లో బిల్లు పెట్టామని చెప్పారు. ఆ రోజును సోషల్ జస్టిస్ డే గా ప్రకటించామని, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయమని గల్లీ నుంచి దిల్లీ వరకు యువత పోరాడారని వివరించారు. 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి చిత్తశుద్ధిని చాటుకున్నామని చెప్పారు. రిజర్వేషన్లు పెంచాలనే బలహీన వర్గాల ధర్మబద్ధమైన కోరిక నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ముందుకురావాలని పిలుపునిచ్చారు. బీసీల రిజర్వేషన్ల పెంపునకు బీజేపీ వ్యతిరేకమని, మొరార్జీ దేశాయ్ మండల్ కమిషన్ నియమిస్తే, వీపీ సింగ్ మండల్ కమిషన్ దుమ్ము దులిపి ముందుకు తెచ్చారన్నారు. మండల్ కమిషన్‌పై బీజేపీ కుట్ర చేసి కమండల్ యాత్ర మొదలుపెట్టిందని, ఆ కమండల్ యాత్ర ప్రతినిధే నరేంద్ర మోదీ అంటూ ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ అమ్మలా వ్యవహరించి దళిత, ఆదివాసీ వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చి ఇళ్లు ఇచ్చిందన్నారు. భూస్వాముల వద్ద వేల ఎకరాలు గుంజుకొని ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిందని చెప్పారు. బలహీన వర్గాలను బలోపేతం చేయడానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. 2021లో చేయాల్సిన జనాభా లెక్కలను బీజేపీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కులగణన చేయాలని డిమాండ్ చేసినా జన గణన చేయకుండా వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టలేదని దుయ్యబట్టారు. తెలంగాణలో రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతి ఇస్తే 10 లక్షల మందితో సభ పెట్టి మోదీని సన్మానిస్తామన్నారు. బండి సంజయ్ బీసీల కోసం ప్రాణం ఇస్తామంటున్నారని, ఆయన ప్రాణం మాకు వద్దు... వందేళ్లు ఆయన జీవించాలి... మాకు రిజర్వేషన్లు పెంచితే చాలని అన్నారు. న్యాయమైన బీసీ రిజర్వేషన్ల కోసం దిల్లీ వచ్చాం... ఇకపై రామన్నారు. రిజర్వేషన్ల పెంపునకు బలహీన వర్గాలు ధర్మ యుద్ధం ప్రకటించాలన్నారు. మోదీ బీసీ రిజర్వేషన్లు ఆమోదించకపోతే ఎర్రకోటపై జెండా ఎగురవేసి రిజర్వేషన్లు సాధిస్తామని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

హిందూత్వ నయా ఫాసిజంతో దేశానికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

హిందూత్వ ఎజెండాను మరింత వేగంగా ముందుకు తీసుకువెళుతోందని, తీవ్రమైన నయా-ఉదారవాద విధానాలను అమలు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. అదే సమయంలో ఇది నయా-ఫాసిస్ట్ ధోరణులను కూడా ప్రదర్శిస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ ఎజెండాను అమలు చేయడంలో భాగంగా ముస్లిం సమాజాన్ని నిరంతరం వేటాడుతోందని మండిపడ్డారు. మైనారిటీలే లక్ష్యంగా హిందూత్వ సంస్థలు మత అల్లర్లను సృష్టిస్తున్నారని, వీరికి బీజేపీ పాలిత రాష్ట్రాలలో అధికారుల నుండి మద్దతు, సహాయం అందుతున్నాయన్నారు.

సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా సౌహార్ద సందేశాన్ని ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యతతో ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. ప్రత్యామ్నాయ విధానాలను బలంగా ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత వామపక్షలపై ఉందన్నారు. 'జై భీమ్, లాల్ సలామ్, ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నవి ఇక ఏమాత్రం నినాదాలు కావని, అవి జాతి జీవన విధానం కావాల్సిఉందని చెప్పారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు చేస్తున్న మోదీ పాలనపై సంఘ టిత పోరాటానికి ఇదే కీలక సమయమని, రాబోయే రోజుల్లోఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) ప్రధాన కార్య దర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవ రాజన్‌లు కూడా పాల్గొని సౌహార్ద సందే శాలను ఇచ్చారు. వెణ్మణి అమరవీరుల స్మారక పతాకాన్ని కేంద్ర కమిటీ సభ్యులు యు.వాసుకి స్వీకరించి, పార్టీ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎకె. పద్మనాభన్‌కు అందజేశారు. ఆ తరువాత మహాసభ ప్రారంభ సూచికగా సీనియర్ నేత బిమన్‌బసు అరుణ పతాకాన్ని ఆవిష్కరిం చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు కె.బాలకృష్ణన్ స్వాగతోపన్యాసం చేశారు.సభకు అధ్యక్షత వహించిన మాణిక్ సర్కార్, ప్రారంభోప న్యాసం చేసిన ప్రకాశ్ కరత్‌లతో పాటు సౌహార్ద సందేశాలు ఇచ్చిన నేతలకు ఆహ్వాన సంఘం చిరు సత్కారం చేసింది. అనంతరం వేదికపై నేతలందరూ చేతులు కలిపి అభివాదం తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ప్రతినిధుల సమావేశం ప్రారంభమైంది.

ఏపీలో ఇంటి వద్దే 47 రకాల వైద్య పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

చేయడం జరుగుతుంది. నిర్దిష్ట వ్యాధులకు సంబంధించి మరో 27 పరీక్షలను చేస్తారు. కొత్తగా ఈ సేవల బాధ్యతలను స్వీకరించనున్న సర్వీస్ ప్రొవైడర్ సాధారణ 20 పరీక్షలను ఒక్కొక్కరికి రూ.195 ఖర్చుతో చేయడానికి అంగీకరించింది. అంతే కాక ఇతర వ్యాధి పరీక్షలకు కూడా మార్కెట్ రేట్లతో పోలిస్తే సహేతుకమైన ఛార్జీలను ప్రతిపాదించారు. ప్రతి 104 వాహనం ద్వారా రోజుకు దాదాపు 35 మందిని పరీక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ముందు మొబైల్ మెడికల్ యూనిట్ల డేటా యొక్క విశ్వసనీయతను తనిఖీ చేసేందుకు ఈ నిర్ధారణ పరీక్షలను పైలట్ ప్రాతిపదికన ప్రభుత్వం చేపడుతుంది. ఈ పరీక్షలు నిర్వహించడానికి కొత్త ఏజెన్సీ ఆయా పరికరాలను ప్రతి 104 వాహనంలో సెమీ-ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, సిబిసి మెషిన్ 3 పార్ట్ ఎనలైజర్, మైక్రోస్కోప్ మరియు ఇంక్యుబేటర్ వంటి పరికరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి వాహనంలో ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా ఉంటారు.108 మరియు 104 సేవలతో పాటు అత్యవసర ప్రతిస్పందన కేంద్రాన్ని నిర్వహించడానికి ప్రభుత్వం ప్రస్తుతం నెలకు రూ.28 కోట్లు చెల్లిస్తోంది.

కొత్త టెండర్ కింద ఈ ఖర్చు నెలకు రూ.31 కోట్లకు చేరుతుంది. ఇది టెండర్ ధరలో కేవలం 11 శాతం లోపు మాత్రమే పెరుగుదలగా ఉంది. కొత్త ఏజెన్సీ 190 కొత్త 108 వాహనాలను ఖరీదు చేసి ఏర్పాటు చేయడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. 108 అంబులెన్స్‌ల డ్రైవర్లకు, నెలకు రూ.2 వేలు అదనంగా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కంచ గచ్చిబౌలి భూముల్లో పనులు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... '2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు' అని ఏజీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ... విచారణను గురువారానికి వాయిదా వేసింది.

జపాన్‌లో భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

మైన్మార్, థాయ్‌లాండ్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించి 3,000 మందికి పైగా మరణించారు. కొన్ని రోజుల తర్వాత ఈ భూకంపం సంభవించింది.

ఇదిలాఉండగా, జపాన్‌లో భూకంప ఘటనలకు సంబంధించి ఆ దేశ ప్రభుత్వం ఇటీవల ఓ నివేదిక విడుదల చేసింది. ఎప్పటినుంచో అంచనా వేస్తున్నట్లుగా... పసిఫిక్ తీరంలో ఒకవేళ భారీ భూకంపం సంభవిస్తే భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని, 1.81 ట్రిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లవచ్చని పేర్కొంది. భీకర సునామీలు రావచ్చని, దీంతో వందలాది భవనాలు నేలమట్టమవుతాయని తెలిపింది. తద్వారా దాదాపు 3 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు లక్షలాదిమంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అంచనా వేయడం కలవరపెడుతోంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను మే1 వరకు పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినవారి ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా డీజే, డ్రోన్‌లపై కూడా మే 1వరకు నిషేధాజ్ఞలు పొడగించామని తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర-మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామంలో యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ నూతన ఆలయ నిర్మాణానికి మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావును బుధవారం మరిపెడ మండలం బీచ్ రాజుపల్లి గ్రామంలో యాదవ సంఘం కమిటీ సభ్యులు కలిసి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన గుడిపూడి నవీన్‌రావు గుడి నిర్మాణానికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గుడిపూడి నవీన్‌రావుని యాదవ సంఘం కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ కొమ్ము నరేష్, కొమ్ము చంద్రశేఖర్, కోడి శ్రీకాంత్, వల్లపు లింగయ్య, కొమ్ము లింగయ్య, కొమ్ము ఉప్పలయ్య, కొమ్ము ఐలయ్య, కోడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

విశాలాంధ్ర, కొమురం భీం. బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అధికారులు, గౌడ సంఘం నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల నాయకులతో హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పాపాన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల కొరకు రాజ్యాధికార పోరాటాలు చేసిన యోధుడు అన్నారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సజీవన్, తదితరులు పాల్గొన్నారు .

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర - గార్ల : విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని అలా కాకుండా నాణ్యతలేని, నాసిరకం పదార్థాలు అందిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ హెచ్చరించారు. బుధవారం గార్ల మండలంలోని ఆశ్రమ హై స్కూల్, కె.జి.బి.వి, ఎస్.సి బాలికల, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టోర్ గదిని, డైనింగ్ హాలు, క్లాస్ రూంలను నిషితంగా పరిశీలించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. టాయి లెట్, బాత్రూం లను పరిశీలించి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. వేసవి దృష్ట్యా విద్యార్థులకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రత్యేక శిక్షణ, తరగతుల నిర్వహణ, ప్రశ్న, జవాబు పత్రాల నమూనాలపై అవగాహన కల్పించారు. భోజన ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ లో వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కులాలు, మతాల మధ్య బీజేపీ చిచ్చు : మంత్రి సీతక్క

విశాలాంధ్ర -(మల్లంపల్లి)ములుగు జిల్లా బ్యూరో : కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపికి, ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని, భారత రాజ్యాంగాని మార్చే కుట్ర బిజెపి చేస్తుందని, అంబేద్కర్ పై అమిత్షా వ్యాఖ్యలు, దేశ సమాజం క్షమించారనిదని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ, సీతక్క అన్నారు. బుధవారం మల్లంపల్లిలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమానికి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రి సీతక్క, జిల్లా ఇంచార్జి కైలేష్ హాజరై మాట్లాడారు. ముందుగా అంబేద్కర్ విగ్రహంకు పూలమాలతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి రాహుల్ గాంధీ పిలుపునిచ్చారని, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్ర స్థాయిలో బలంగా తీసుకెళ్ళాల్సిన అసవరం ఉందన్నారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ఆశయాలకు, తగ్గట్టుగానే రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ విధానాలను రూపొందిస్తుందన్నారు. రాష్ట్రంలో విప్లవాత్మక కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందన్నారు. బీసి కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం సామాజిక విప్లవం తీసుకువస్తుందన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని మంత్రి సీతక్కతెలిపారు.కార్యకర్తల పోరాట ఫలితంగానే,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని,అధికారంలోకి వచ్చినా,ఏడాది కాలములో 53 వేల ఉద్యోగాలు ఇచ్చామని, బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా కార్యకర్తలు పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ లో కష్టపడి పనిచేస్తే తప్పకుండా అవకాశాలు వస్తాయని మంత్రి సీతక్క ఇంఛార్జి కైలేశ్ నేత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్,తో అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు,బ్లాక్,మండల అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధిలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐఎస్ఎఫ్ చలో సెక్రటేరియట్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలు నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే ఫహీమ్ దాదా డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్త సమావేశం శేషగిరి భవన్‌లో జరిగింది. ఇందులో పాల్గొన్న ఫహీమ్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించిన 400 ఎకరాల భూముల వేలాన్ని నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారుల దాహం తీర్చేందుకే భూముల అమ్మకానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. ఈ భూముల అమ్మకం వల్ల భవిష్యత్తులో యూనివర్సిటీలో ఉనికి ప్రమాదకరంగా మారుతుందన్నారు. దీనికోసం ఉద్యమించిన యూనివర్సిటీ విద్యార్థుల అరెస్టులను ఖండించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వంశి, అజీత్, సృజన్, రణదీర్, వినయ్, గిరిప్రసాద్, నాగరాజు, వెంకట్, విజయ్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర- పెనుబల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పెనుపల్లి మండలం ముత్తగూడెం, గణేష్ పాడు గ్రామంలోని రేషన్ షాపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో ఒకటైన పేదవాడికి చౌక ధరల దుకాణం ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే రాగమయి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్యెల్యే రాఘమయి మాట్లాడుతూ.... రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడు లేని విధంగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. 10 లక్షల రేషన్ కార్డులు త్వరలో రాబోతున్నాయని రాష్ట్రంలో మొత్తం 90 లక్షల రేషన్ కార్డులకు సుమారు రూ. 8 వేల కోట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ఖజానాపై భారం అనుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని పథకాలు అమలు చేస్తుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా 5 లక్షల మందికి రుణాలు ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మీద భారం పడ్డ వెనకాడకుండా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. సన్న బియ్యం పంపిణి పట్ల పెనుబల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ కే. చందన్ కుమార్, ఎంపీడీవో అన్నపూర్ణ, డిటిసిఎస్ సిహెచ్ సత్యనారాయణ, సిఎస్ సి ఐ వి. నరేష్, ఆర్ ఐ జగదీష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, సోమరాజు సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థలా చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్‌ను నియమించగా కొత్తగూడెంలోని మెయిన్ ఆసుపత్రిలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రామ గుండం (ఆర్‌జి-1) ఏరియా హాస్పిటల్ లో ఏసిఎంఓ గా పనిచేస్తూ ఇటీవల సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ గా నియామకమైయ్యారు. ఈ సందర్భముగా ఏసిఎంఓ ఎం.ఉష, డివై.సిఎంఓ జి.సునీల, డాక్టర్లు, ప్రతినిధులు, అధికారులు, యూనియన్ నాయకులు నూతన సిఎంఓ కిరణ్ రాజ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసారు.

పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరో మహబూబాబాద్: జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్స్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డిపిఎంలు, ఏపీఓలు, తదితర అధికారులతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకం అమలు, తాగునీరు సరఫర, ఎన్ఆర్ఈ ఆర్జిఎస్, పెన్షన్స్, సేర్ప్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో నిరుద్యోగులకు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి అందరికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, ప్రదేశాలలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గత సంవత్సరం, ఈ సంవత్సరం వేసవికాలం యాక్షన్‌ప్లాన్ ప్రకారం మున్సిపల్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఎంపీడీవోలు గ్రామస్థాయి లో పంచాయతీ కార్యదర్శులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు త్రాగునీరు అందించుటకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, (రెవెన్యూ),లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీర బ్రహ్మచారి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జెడ్పి సీఈఓ పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాస్, దేశి రామ్, మండల ప్రత్యేక అధికారులు మరియన్న, సురేష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సన్న బియ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వనపర్తి : రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని ఉచితంగా ఇవ్వడం చారిత్రాత్మకమైనది. ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన ప్రభుత్వంలో నిరుపేదలు సైతం సన్న రకం బియ్యంతో నాణ్యమైన భోజనం చేయాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిమతమని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఘనపూర్ మండలంలోని 3వ నెంబర్ చౌక ధర దుకాణంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు తో కలిసి వనపర్తి జిల్లాలో సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేదలకు మూడు పూటల భోజనం పెట్టాలనే ఉన్నత ఆశయంతో ప్రారంభించిన బియ్యం పంపిణీ కార్యక్రమం కాలక్రమేణ ప్రజలు దొడ్డు రకం బియ్యం తినకుండా అమ్ముకోవడంతో తిరిగి మిల్లులకు చేరి రీసైక్లింగ్ కావడం జరిగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో శ్రీమంతులు తినే సన్న రకం బియ్యం ప్రతి పేదవాడు సైతం తినాలి అనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం కింద తెల్ల రేషన్ కార్డుల వారికి ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున సన్న రకం నాణ్యమైన బియ్యం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మొత్తం 324 చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందుకు 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుందనీ తెలియజేశారు. అనంతరం పెద్దమందడి మండలంలోని ఒకటవ నెంబర్ రేషన్ షాపు, వనపర్తి మున్సిపాలిటీలోని 1,9,20వ నెంబర్ జాతీయ ఉత్పత్తి పంపిణీ కేంద్రాల్లో , గోపాల్ పేట, పెబ్బేరు మండలాల్లో సైతం సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహశీల్దార్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రంతో శాంతి చర్చలకు సిద్ధం : మావోయిస్టులు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : కేంద్రంతో శాంతిచర్చలకు సిద్ధమని, మావోయిస్టులు ప్రకటించారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. ఒడిశా, ఛత్తీస్ గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హత్యాకాండను ఆపాలని విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు తాము సిద్ధమని చెప్పారు. ఇటీవల కేంద్రం చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్లో వందల సంఖ్యలో మావోయిస్టులు మరణించారని, ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-తొర్రూరు: రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండను ఆక్రమించి ఉద్యమించిన మహనీయుడు, ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి.రమణ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతి వేడుకలను గౌడ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తొర్రూర్ విశ్రాంతి ముందు ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్,కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు,గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్, గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గునిగంటి మోహన్, జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకన్న మండల ప్రధాన కార్యదర్శి దీకొండ మధు, జిఎస్పిఎస్ అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్,కెఎస్ పిఎస్ అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కె.మహేష్ కుమార్ గౌడ్, పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

విశాలాంధ్ర బ్యూరో సంగారెడ్డి : బడుగు బలహీన వర్గాల ప్రజలను ఐక్యం చేసి స్వాతంత్రం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతన బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, డి ఆర్ ఓ పద్మజ రాణి, జిల్లా బిసి సంక్షేమ అధికారి జగదీష్,వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి తో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా చౌకధర దుకాణాలలో తూకం సరిగా ఉండేలా చూడాలని చెప్పారు. మండలంలో ఖాళీగా ఉన్న అన్ని చౌక ధర దుకాణాల ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు . రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని , కొత్త రేషన్ కార్డులకు మీ -సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, రేషన్ కార్డులో పేర్లను సైతం మీ- సేవ కేంద్రాలద్వారా చేర్చుకోవచ్చని చెప్పారు. చనిపోయిన వారి పేర్లను తామె స్వచ్ఛందంగా రతియం కార్డుల నుండి తొలగిస్తామని, పారదర్శకంగా నిర్వహించే ఈ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ మేలుకలిగేలా సన్న బియ్యం కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని, దీనికి అందరూ సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, తిరుమలగిరి సాగర్ స్పెషలాఫీసర్, ఏపీ డి శారద, మాజీ జెడ్పిటిసి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ గృహనిర్మాణ శాఖ పి డి రాజ్ కుమార్,స్థానిక తహశీల్దార్ తదితరులు ఉన్నారు.అంతకుముందు జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు తహసిల్దార్ కార్యాలయంలో తిరుమలగిరి సాగర్ మండలంలో చేపట్టిన భూమి రెగ్యులరైజేషన్ పైలట్ ప్రాజెక్ట్, ప్రభుత్వ సంస్థలకు భూమి కేటాయింపు ,వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై సమీక్షించారు. పైలెట్ ప్రాజెక్టు కింద అర్హులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎం ఎల్ ఏ కోరారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,శాసన సభ్యులు చౌకధర దుకాణాన్ని ప్రారంభించి సన్న బియ్యాన్ని పంపిణీచేశారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూముల స్వాధీనం ఆపాలి

విశాలాంధ్ర ఖమ్మం : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఏ ఐ ఎస్ ఎఫ్, ఎస్ ఎఫ్ ఐ ,పి డి ఎస్ యు తదితర విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. దౌర్జన్యం పూరిత వాతావరణాన్ని విశ్వవిద్యాలయాల్లో కల్పించడం అప్రజా స్వామికం అని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ , పిడిఎస్యు జిల్లా కార్యదర్శి మస్తాన్, జిల్లా అధ్యక్షులు మంద సురేష్ లు అన్నారు. స్థానిక యూనివర్సిటీ అనుబంధ పీజీ కళాశాల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణాన్ని కల్పించాల్సినపోయి విద్యార్థుల పైన ధమనకాండను ప్రదర్శించడం బాధాకరమన్నారు. యూనివర్శిటీకి చెందిన 400 ఏకరాల భూమిని కాపాడుకునేందుకు పోరాడుతున్న విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సుధాకర్ శివ మనోజ్ రాజు. అజయ్ సాగర్ బాను సాయి వినోద్ ప్రతాపు గణేష్ గోపి తదితరులపాల్గొన్నారు.

చలి వేంద్రాలు సద్వినియోగం చేసుకోండి :మంత్రి

విశాలాంధ్ర -ములుగుజిల్లాబ్యూరో : ములుగు మండలంలోని జంగాలపల్లి ఎక్స్ రోడ్డు వద్ద గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని, వెంకటపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్‌లతో కలిసి ప్రారంభించారు. తాడ్వాయి మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి కల్యాణలక్ష్మి, షాది ముభారాక్ లబ్ధిదారులకు 26 మందికి చెక్కులను అందచేశారు.

పేదలకు సన్న బియ్యం పంపిణీ : కలెక్టర్

విశాలాంధ్ర, కొమరం భీం: నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం కేంద్రంలోని చౌక ధరల దుకాణంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఇతర అధికారులతో కలిసి రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని, ప్రజాసంక్షేమంలో భాగంగా పేదవారి కడుపు నింపేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలోని 314 పౌరసరఫరాల దుకాణాల ద్వారా ప్రతి రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. బియ్యం పంపిణీ సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేషన్ షాపుల వద్ద ప్రధాని మోదీ పోటో పెట్టాలి

విశాలాంధ్ర-నేరేడుచర్ల : సూర్యాపేట బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని అనేక రేషన్ షాపులను ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసే సమయంలో వెళ్ళి పరిశీలించారు .అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని రేషన్ షాపుల వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం మోదీ ఫ్లెక్సీని , తగిన సైజులో, ప్రజలకు కనపడేలా పెట్టాలని లేకపోతే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవింగా ప్రతి వ్యక్తి తీసుకునే 6 కేజీల సన్నబియ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా కేవలం 1 కేజీ మాత్రమేనని, కేంద్ర ప్రభుత్వం మాత్రం 5 కేజీలు సన్నబియ్యం ఇస్తున్నదని, డబ్బు రూపంలో చెప్పాలంటే రాష్ట్ర ప్రభుత్వం వాటా కేజీకి కేవలం 10 రూపాయిలు మాత్రమేనని, అదే కేంద్ర ప్రభుత్వం అయితే ఒక కేజీకి 40 రూపాయలు ఇస్తున్నదని కనుక ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, పాలకీడు మండల అధ్యక్షులు నర్రి. నాయక్, జిల్లా కన్వీనర్ సంకలమద్ది. సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర నాయకులు బాల. వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చా అధ్యక్షులు తాళ్ల. నరేందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు తాళ్లూరి రమేష్ నాయుడు, అంబటి నాగేశ్వరావు, కాంపెల్లి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ నాయకులపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర- ఖమ్మం: దేశంలో పెరుగుతున్న పెట్రోల్ ధరలను అదుపు చేయాలని కోరుతూ సీపీఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులపై నమోదైన కేసు బుధవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే... 2020 ఫిబ్రవరి 21న కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ ధరలను తగ్గించాలని కోరుతూ సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నాయకత్వాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో అప్పటి జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తో పాటు మరికొంత మంది కార్యకర్తలు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కాగా ఐదు సంవత్సరాల విచారణ అనంతరం సరైన సాక్ష్యాధారాలు లేనందున సిపిఐ నాయకులపై పెట్టిన కేసును జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. ముద్దాయిల తరుపున న్యాయవాదులుగా ఓరుగంటి శేషగిరిరావు, తోట రామాంజనేయులు, ఆర్. రాకేష్, కన్నెబోయిన నాగేశ్వరరావు లు వాదించారు. తమపై అక్రమంగా పెట్టిన కేసులను కోర్టు కొట్టివేయడంతో సిపిఐ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

జగ్జీవన్ , అంబేద్కర్‌ల జయంతి ఉత్సవాలను నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్‌ల జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ విషయమై బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్‌లో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ రెండు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణలో తీసుకోని విజయవంతం చేసేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ పి రమేష్, జడ్పి సి ఈ ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డిసిఓ పత్యా నాయక్ హాజరయ్యారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ

విశాలాంధ్ర -ముదిగొండలి: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్,సిపిఎం, నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గుడిపూడి బుచ్చిరామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు పడితున్నా, సంక్షేమపథకాలు ప్రభుత్వానికి భారమేన ప్రజాసంక్షేమాన్ని విడేది లేదన్నారు. ప్రజలకు ఆర్థిభారం తగ్గించి వారి జీవన ప్రమాణాలను పెంచటమే సన్నబియ్యం పంపిణి ప్రధాన ఉద్దేశమన్నారు. పంపిణీ సందర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో విజయవంతంగా అమలు చేస్తున్న గ్రామ నాయకులను అభినందించారు. మండల కాంగ్రెస్ నాయకులు గుడిపూడి బుచ్చిరామయ్య గ్రామ శాఖ అధ్యక్షులు కందుల బాలచందర్ ఉపాధ్యక్షులు గంట వెంకట్రావు, సిపిఎం పార్టీ సినీయర్ నాయకులు కందుల భాస్కరరావు ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట కృష్ణ, సేవాదళ్ అధ్యక్షులు చిర్ర శ్రీను, కట్ల సత్యనారాయణ, షేక్ మదార్ బీ, కట్ల కాంతారావు, ఉరిమల్ల వెంకటేశ్వర్లు, చుంచు వీరబాబు,బంక వెంకటేశ్వర్లు, బంక సైదులు, బంక గురవయ్య, రెంటాల లక్షమయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంపాదకీయం

చిన్న కోర్టు-విశిష్ట ఆదేశం

అయిదేళ్ల కింద దిల్లీలో జరిగిన మత కలహాలను రెచ్చగొట్టారన్న ఆరోపణ ఎదుర్కుంటున్న దిల్లీ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని దిల్లీలోని అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గత ఒకటవ తేదీన ఆదేశం జారీ చేశారు. అంటే పలుకుబడి గల ఒక నాయకుడిపై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయడానికి అయిదేళ్లు పట్టింది. కపిల్ శర్మ మొదట ఆమ్ ఆద్మీ పార్టీలో ఉండేవారు. ఆయన ఆ తరవాత బీజేపీలో చేరారు. ప్రస్తుతం దిల్లీ బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 2020 లో ఈశాన్య దిల్లీలో మత కలహాలు జరగక ముందు కపిల్ శర్మ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. "జె.ఎన్.యు.కె గద్దారోంకో గోలీ మారో, జామియాకే గద్దారోంకో గోలీ మారో అని ఆయన నినాదాలు చేశారు. అప్పటి మత కలహాల్లో 53 మంది మరణించారు. 700 మంది గాయపడ్డారు. ఆ సమయంలో కపిల్ మిశ్రా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడానికి, ఆ తరవాత మత కలహాలు చెలరేగడానికి సంబంధం ఉందని అందువల్ల ఆయన మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేసి చట్ట రీత్యా చర్య తీసుకోవాలని 2024 డిసెంబర్‌లో యమునా విహార్‌లో నివాసం ఉండే మహమ్మద్ ఇల్యాస్ ఒక పిటిషన్ దాఖలు చేశారు. 2020 నాటి దిల్లీ మతకలహాల్లో కపిల్ మిశ్రా పాత్రపై తాము దర్యాప్తు చేశామనీ కానీ ఆయనకు వ్యతిరేకంగా ఏ సమాచారమూ దొరకలేదని దిల్లీ పోలీసులు గత నెలలో తెలియజేశారు. ఇల్యాస్ దాఖలు చేసిన పిటిషన్‌లో కపిల్ మిశ్రాతో పాటు ముస్తఫాబాద్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిష్ట్, అప్పుడు ఈశాన్య దిల్లీ డి.సి.పి.గా ఉన్న పోలీసు అధికారి, బీజేపీ మాజీ శాసనసభ్యుడు జగదీశ్ ప్రధాన్ మీద కూడా చర్య తీసుకోవాలని ఇల్యాస్ కోరారు. కపిల్ మిశ్రా మరికొందరు 2020 ఫిబ్రవరి 23 కర్దంపురిలో రోడ్డును మూసేసి తోపుడు బళ్లను పడదోశారని ఇల్యాస్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ సమయంలో పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతుండేవి. డి.సి.పి., ఇతర అధికారులు పక్కన ఉండగానే కపిల్ మిశ్రా రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. ఆ సమయంలో ట్రంప్ మన దేశంలో పర్యటిస్తుండేవారు. ఆయన వెళ్లనివ్వండి అప్పుడు తమ శక్తి ఏమిటో చూపిస్తామని కూడా కపిల్ మిశ్రా అన్నారు. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసిన వారిని కపిల్ మిశ్రా బాహాటంగానే బెదిరించారు. ఇవేవీ ఇంతకాలం దిల్లీ పోలీసులకు కనిపించలేదు. ఆరోపణలు ఎదుర్కుంటున్న వారిపై ఎఫ్.ఐ.ఆర్.దాఖలు అయ్యేట్టు చూడడానికి కూడా కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. తమ మీద లైంగిక అత్యాచారాలకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని మహిళా మల్ల యోధులు దిల్లీ వీధుల్లో దీర్ఘ కాలం నిరసన తెలియజేయవలసి వచ్చింది. 2020 నాటి ఈశాన్య దిల్లీలో జరిగిన అల్లర్లలో 53 మంది మరణిస్తే వారిలో 40 మంది ముస్లింలే. అంటే హిందుత్వ వాదుల ఆగడాలు ఎంత భీకరమైనవో అర్థం చేసుకోవచ్చు. కానీ దిల్లీ పోలీసులకు కపిల్ మిశ్రా లాంటి వారి రెచ్చగొట్టే ప్రసంగాలు వినిపించలేదు. అయితే ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమాం, గుల్ఫిషా ఫాతిమా లాంటి విద్యార్థి నాయకుల మీద మాత్రం కేసులు మోపారు. ఉమర్ ఖాలిద్ గత అయిదేళ్ల నుంచి జైలులో ఉన్నారు. కనీసం బెయిల్ కూడా మంజూరు కావడం లేదు.

దిల్లీ మత కలహాల తరవాత దిల్లీ మైనారిటీ కమిషన్ పది మంది సభ్యులతో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మత కలహాలు ఒక ప్రణాళిక ప్రకారం, నిర్దిష్ట వర్గానికి వ్యతిరేకంగా జరిగాయని ఈ నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. ఈ కలహాలకు కపిల్ మిశ్రా కారణం అని కూడా చెప్పింది. 2020 ఫిబ్రవరి 23 న కపిల్ మిశ్రా ప్రసంగం చేసిన కొద్ది సేపటికే మత కలహాలు మొదలైనాయి. ఈశాన్య దిల్లీలోని జఫ్రాబాద్‌లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న వారిని అక్కడ నుంచి తొలగించాలని కపిల్ మిశ్రా పిలుపు ఇచ్చారు. మూడు రోజుల్లోగా ఈ పని జరగకపోతే తామె నిరసనకారులను తొలగిస్తామని కూడా కపిల్ మిశ్రా హెచ్చరించారు. అయిదేళ్లుగా మిశ్రా ఆగడాలేవీ దిల్లీ పోలీసులకు వినిపించకపోవడం, కనిపించకపోవడం చూస్తే మత కలహాలను రెచ్చగొట్టే వారికి కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షం వారి బహిరంగ మద్దతు ఉందని రుజువవుతోంది. నిరసనకారులను రోడ్డు మీంచి తొలగించకపోతే ఊరుకునేది లేదని, పోలీసులు ఏం చెప్పినా వినేది లేదని కపిల్‌మిశ్రా అన్నారు. నిజానికి దిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పని చేస్తారు. అంటే దిల్లీ పోలీసులు తమ పార్టీ ప్రభుత్వం అధీనంలోనే పని చేస్తారని తెలిసినా కపిల్ మిశ్రా రెచ్చిపోయి మాట్లాడడానికి సాహసించడం వెనక ఆంతర్యం ఏమిటో గ్రహించ వచ్చు. కపిల్ మిశ్రా మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలని దిల్లీలో ఓ కింది కోర్టు న్యాయమూర్తి ఆదేశించడానికి న్యాయపరంగానే కాక రాజకీయ పరంగా కూడా ప్రాధాన్యం ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కపిల్ మిశ్రా బీజేపీలో చేరిన తరవాత కరడుగట్టిన హిందుత్వ వాదులను మించి పోయే ప్రసంగాలు చేశారు. అసలు హిందుత్వ వాదులకన్నా తానే ఎక్కువ హిందుత్వ వాదినని నిరూపించుకోవడానికి నాలుక మీద అదుపు లేనట్టుగా మాట్లాడుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీలో ఉన్నంత కాలం కపిల్ మిశ్రా సెక్యులర్ వాదిగానే కనిపించారు. దిల్లీలో మతకలహాలు జరిగిన సమయంలోనె హిందుత్వ వాదులు పౌరసత్వ సవరణ చట్టానికి నిరసన చేస్తున్న వారిని తొలగించారు. వారి శిబిరాలను పెరికి వేశారు. బీజేపీ దిల్లీ మత కలహాలను దేశానికి వ్యతిరేకంగా పన్నిన కుట్రగా అభివర్ణించింది. మరీ విచిత్రం ఏమిటంటే పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేసిన సీతారాంఏచూరి లాంటి సీనియర్ రాజకీయ నాయకుల పేర్లు కూడా దిల్లీ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్.లో చేర్చారు. అయితే వారిని అరెస్టు చేయలేదు. కపిల్ మిశ్రా మీద మాత్రం ఎఫ్.ఐ.ఆర్. దాఖలే చేయలేదు. దిల్లీ పోలీసుల పక్షపాత ధోరణికి ఇవన్నీ మచ్చుతునకలే. కపిల్ మిశ్రాకు దిల్లీ మతకలహాలతో ఏ సంబంధమూ లేకపోయినా ఆయనను ఇందులో ఇరికిస్తున్నారని కూడా పోలీసులు అన్నారు. ఈ కారణాలన్నీ దిల్లీ కోర్టు ఆదేశానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. దిల్లిలో నిషేధాగ్నలను కూడా లెక్క చేయకుండా కపిల్ మిశ్రా తన మద్దతుదార్లను వెంటేసుకుని విచ్చలవిడిగా తిరిగినా ఆయన మీద ఏ చర్యా తీసుకోలేదు.

రైతు వ్యతిరేకత వదలని కేంద్రం

కాగితాల రాజశేఖర్

రైతు వ్యతిరేకత, కార్పొరేట్లకు దాసోహం అనే విధానాలను కేంద్ర ప్రభుత్వం వదులుకోలేదు. గతంలో ప్రధాని మోదీ తెచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా 383 రోజులు సాగిన ఆందోళనకు తలొగ్గి వాటిని ఉపసంహరించుకున్నారు. కేంద్రప్రభుత్వం 2024 లో (1) నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆఫ్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ (2) నేషనల్ కో ఆపరేటివ్ పాలసీ (3) డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ల పేర్లతో మూడు పథకాలను తెచ్చింది. నాటి రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు ప్రతి రూపమే ఈ పథకాలు. గతంలో ఉపసంహరించుకున్న మూడు నల్ల వ్యవసాయ చట్టాల స్థానంలో మరింత ప్రమాదకర చట్టాలు తెచ్చే ప్రయత్నాలలో భాగమే ఈ పథకాలు. భారత వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించేందుకు, మార్కెట్ సదుపాయాలను విస్తరించేందుకు, డిజిటలైజేషన్ ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా మార్చాలనే అందమైన మాటలు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో ఇవి రైతుల బతుకు చిన్నాభిన్నం చేస్తాయనే విమర్శలున్నాయి. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ 2024 జూన్ 25 న జాతీయ వ్యవసాయ మార్కెట్ పాలసీ ముసాయిదాను రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి ఫైజ్‌అహ్మద్ కిద్వాయ్ నియమితులయ్యారు. 2024 నవంబరు 25 న ముసాయిదా మార్కెటింగ్ ఫ్రేమ్ వర్క్‌ను ప్రతిపాదిస్తూ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రకటించింది. వ్యవసాయ ఉత్పత్తులపై సార్వత్రిక పన్ను విధించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని కమిటీ చెబుతున్నది. ప్రభుత్వ మార్కెట్ యార్డుల స్థానంలో వ్యవసాయ మార్కెటింగ్ కొత్త ఫ్రేమ్ వర్క్‌ను కమిటీ సూచించింది. రైతాంగ ఉత్పత్తులను పెద్ద మొత్తంలో నిల్వ చేయడం, కార్పోరేట్ సంస్థల ద్వారా నేరుగా కొనుగోలు చేయడంపై చట్టాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నేరుగా పన్నులు వసూలు చేసేందుకు జి.యస్.టి. తరహాలో రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డులను రద్దు చేసే ప్రయత్నాలకు కొత్త ప్రతిపాదనల ద్వారా చేయపూనుకున్నది. ప్రైవేట్ సంస్థలకు మరింత అవకాశాలు కల్పించడంతో, చిన్న రైతులు పోటీ చేయలేక తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడబోతుంది. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ యార్డుల వ్యవస్థను బలహీనపరచడం రైతులకు నష్టకరం. పెద్ద కంపెనీల గుత్త ఆధిపత్యానికి అవకాశం ఏర్పడి రైతుల చెల్లింపులపై అధిక నియంత్రణ సాధించే అవకాశం ఉంది.

నేషనల్ కో ఆపరేటివ్ పాలసీలో భాగంగా రాష్ట్రాల జాబితాలో ఉన్న సహకార రంగాన్ని కేంద్రం పరిధిలోకి తీసుకునే దుష్టపన్నాగానికి పూనుకుంటున్నది. జాతీయ సహకార పాలసీని ప్రకటించి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బహుళ ప్రయోజన ప్రాథమిక సహకార సంఘాలుగా మారుస్తున్నట్లు ప్రకటించింది. స్వతంత్ర సహకార సంఘాలుగా పనిచేస్తున్న పాల సహకార సంఘాలు, మత్స్యకార సహకార సంఘాలను వాటితో అనుసంధానం చేస్తున్నది. ఈ సంఘాలలో రైతులు, పాల ఉత్పత్తిదారులు, చేపలు పెంచేవారు సభ్యులుగా ఉంటారు. సంఘంలో ఎంత షేర్ ధనం ఉన్నా ఒకొక్కరికి ఒకొక్క ఓటు ఉంటుంది. నూతన చట్టం ప్రకారం పై మూడు రంగాలలో వ్యాపారం చేసేవారు, ఫుడ్ ప్రాసిసెంగ్ యూనిట్లు నడిపేవారు, పెట్టుబడులు పెట్టేవారు " ఏ' తరగతి వారు సభ్యులుగా చేరవచ్చు. వీరు 20 శాతం వరకు షేర్ ధనం కట్టవచ్చు. ఒకొక్కరికి 20 శాతం ఓటింగ్ హక్కు కూడా ఉంటుంది. అంటే సదరు సొసైటీలన్నీ కార్పోరేట్లు, పెట్టుబడిదారుల వశం అవుతాయి. ఇది అత్యంత అప్రజాస్వామిక దుర్మార్గపూరిత విధానం. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల నియంత్రణను పెంచడం వల్ల స్థానికంగా ఏర్పడే సహకార సంఘాల స్వయం ప్రతిపత్తి పోతుంది. సహకార బ్యాంకులు, సంఘాలు నిధుల కొరతతో సతమతమవుతున్న నేపథ్యంలో, కొత్త విధానం ఆర్థిక స్థిరతను ఏ రకంగా అందించగలదో అర్థం కావడంలేదని నిపుణులు అంటున్నారు.

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ద్వారా సాంప్రదాయ వ్యవసాయాన్ని సాంకేతిక వ్యవసాయంగా మార్చడమే లక్ష్యంగా ప్రకటించింది. మన ఉత్పత్తులు పాలు, జూట్, పప్పుధాన్యాలు ప్రపంచంలో ప్రథమ స్థాయిలోను, గోదుమ, వరి, వేరుశనగ, కూరగాయలు, పండ్లు, పత్తి, చెరకు ఉత్పత్తిలో ద్వితీయ స్థానంలో ఉన్నా అత్యధిక శాతంగా ఉన్న చిన్న కమతాల వ్యవసాయం వల్ల రైతులకు సరైన ఆదాయం రావడంలేదని ముసాయిదా పేర్కొన్నది. రైతులందరినీ గ్రూపులుగా ఏర్పరచి కార్పోరేట్ వ్యవసాయంలోకి తేవాలని తద్వారా కార్పోరేట్ కంపెనీల అజమాయిషిలోకి పేద, మధ్య తరగతి రైతాంగాన్ని బందీలుగా చేసే ప్రయత్నాలు ప్రారంభించింది. డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ వలన రైతుల వ్యక్తిగత డేటా ప్రైవేట్ కంపెనీల చేతికి వెళ్లే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు కొత్త వ్యవస్థలో వెనుకబడి పోవటంతో పాటు, గ్రామాల్లో సరైన ఇంటర్నెట్ లేకపోవటం, రైతులకు వీటిని వాడే నైపుణ్యం లేకపోవడం రైతులకు తీవ్ర హాని చేసే అవకాశం ఉంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా కార్పోరేట్ సంస్థలకు మాత్రం 16 లక్షల కోట్లకు పైగా బకాయిలు రద్దు చేసింది. మరో పక్క రద్దు చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చే పథకాలు రైతుల పాలిట శాపంగా మారనున్నాయి. ఇవి చట్ట రూపం దాల్చకముందే రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని అన్ని రైతు సంఘాలు కలిసి వున్న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. దేశ వ్యాప్తంగా వివిధ రైతు సంఘాలు ఆందోళనలో భాగస్వాములౌతున్నాయి. అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలు ఏప్రిల్ 15, 16, 17 తేదీలలో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రైతులను ఈ ప్రమాదకర చట్టాల పట్ల చైతన్యపరిచేందుకు విజయవాడలో ఏప్రిల్ 3 , 4న కర్నూల్లోనూ, 8న అనంతపురంలోనూ సదస్సులు జరపనుంది. ఈ విధానాలు కేంద్రం రైతుల కోసం తెచ్చినవే అయినా, అమలులో అవి కార్పొరేట్ కంపెనీలకు, రాజకీయాలకు మేలు చేసేలా వున్నాయి. సరైన భద్రత, న్యాయమైన ధరలు, స్వేచ్ఛ లేకుండా రైతులు వ్యవసాయ రంగంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ చట్టాలు రైతులకు నిజమైన మేలు కలిగించేలా మారాలంటే, ప్రభుత్వం నేరుగా రైతులను పరిరక్షించే, వాటిపై సమర్థమైన నియంత్రణ కలిగించే చర్యలు తీసుకోవాలి. లేకపోతే, రైతులు వ్యవసాయ మార్కెట్లో అస్థిరతను ఎదుర్కొంటూ, తమ భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉంది.

సెల్: 9948317270

(నేడు విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో జరుగుతున్న రైతు సదస్సు సందర్భంగా)

ప్రగతి పథంలో తెలుగు పత్రికారచన

డాక్టర్ జీకేడీ ప్రసాదరావు

ప్రపంచీకరణ నేపథ్యంలో సంభవించిన అనేక పరిణామాల్లో ప్రాంతీయ భాషల మీద నిరాదరణ ఒకటి. ఈ సందర్భంలోనే తెలుగుభాష బోధనామాధ్యమంగా అణచివేతకు గురయింది. ఒక్క తెలుగుభాషతో మాత్రమే యువత ఉద్యోగాలు పొందలేరనే భయాన్ని నిండా నింపేసింది ఒక వర్గం. అయితే తెలుగు ప్రజలు ప్రపంచంతో అనుసంధానం కావడానికి అంతర్జాతీయ భాషల అవసరం వుంది. ప్రధానంగా ఇంగ్లీషు భాష అందరికీ అవసరమే. కాకపోతే ఇంగ్లీషు లేకపోతే జీవితమే లేదనేంత తీవ్రప్రచారం జరిగిపోయింది. ఆ తర్వాత ప్రాథమికస్థాయి నుంచి రాష్ట్రంలో ఇంగ్లీషు మీడియం విద్య తీసుకొస్తున్నా మని అప్పటి ప్రభుత్వం కార్యాచరణకు దిగింది. ఈ ముసుగులో వందల సంఖ్యలో పాఠశాలలు మూసేసింది. చిన్నపిల్లలు బడికెళ్ళే దూరాన్ని పెంచేసింది. ఇలా ఎన్నో పరిణామాలు తెలుగుభాష ప్రాభవాన్ని తగ్గించేందుకు కారణమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా తెలుగుభాష, సాహిత్యం, పత్రికారచన వాటి అస్థిత్వాన్ని నిలుపుకున్నాయి. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం చెరిగిపోలేదు. రాజ దర్బారుల నుంచి పల్లెపదాల వరకు తెలుగుభాష సాంస్కృతిక సౌందర్యాన్ని కాపాడుకుంటోంది. ఇటువంటి తెలుగుభాషకు ప్రతికారచన మరింత పరిపుష్టం చేకూర్చింది. తెలుగు పత్రికారచన సంఘసంస్కరణలో, ప్రపంచ యుద్ధ కాలాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో, రాజ్యాంగ రచనా కాలంలో, ప్రజాస్వామ్య రాజకీయాల్లో జీవన వాహికగా పరవళ్లు తొక్కింది. ఇటువంటి తెలుగు పత్రికారచన ప్రత్యేక సబ్జెక్టుగా తెలుగు జర్నలిజం పేరిట కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ప్రారంభించడం చాలా అవసరమని చెప్పొచ్చు.

నేటి గ్లోబల్, డిజిటల్, కృత్రిమమేధ పరంపరలో నడుస్తున్న ప్రసార మాధ్యమాల్లో తెలుగుభాష తన సుస్థిర స్థానాన్ని పదిలపర్చుకుంటుందనే చెప్పాలి. తెలుగు సామాజిక మాధ్యమాల నుంచి యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్లు వాళ్ల ప్రాంతాల మాండలికాల్ని, యాసను, ప్రాసను, సామెతల్ని, జాతీయాల్ని కలగలిపి తమ సొంత వ్యాఖ్యానాలతో, జానపద సౌందర్యంతో భాషకు పరిమళాలు అద్దుతున్నారు. సామాజిక మాధ్యమాలు, వివిధ వేదికలుగా వినోద కార్యక్రమాలు తెలుగుభాషకు మరింత బలం చేకూర్చే కారకాలేనని చెప్పాలి. ప్రపంచంలో తెలుగు రాష్ట్రాల కంటే చిన్న దేశాలు చాలా వున్నాయి. వాటిని అంతర్జాతీయ సమాజం ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు వాటి భాషల్ని గుర్తించింది. ప్రపంచ ప్రసిద్ధ సెర్చ్ ఇంజన్ గూగుల్ సంస్థ ఇన్‌పుట్ టూల్స్‌లో ఇప్పటికే సుమారు 140 భాషల్ని అనువాదంలోకి తీసుకొచ్చింది. కృత్రిమ మేధ నుంచి సైతం అనువాదాల్ని, విశ్లేషణలను పొందే అవకాశం దక్కింది. తొలి తెలుగు పత్రిక 'సత్యదూత' 1835 నుంచి నేటి డిజిటల్ మీడియాలో తెలుగు పత్రికల వరకు తెలుగు జర్నలిజం చరిత్ర అందు బాటులో వుంది. కందుకూరి వీరేశలింగం పంతులు 'వివేకవర్థిని' సామాజిక సంస్కరణకు, తెలుగుభాషకు అంకితమిచ్చారు. ఇలా మొదలైన తెలుగు పత్రికల చరిత్ర, స్వరాజ్య, కృష్ణా పత్రిక, జన్మభూమి, ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ ఇంకా ఎన్నో పత్రికలు స్వాతంత్రోద్యమంలోనూ కీలకపాత్ర పోషించాయి. ఇవిగాక తర్వాత వచ్చిన ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఉదయం, ఈనాడు, వార్త మొదలయిన పత్రికలు కొన్ని లక్ష్యాలతో సాగాయి. వీటికి సమాంతరంగా వామపక్ష పత్రికలు వార్తా ప్రచురణతో పాటు వివిధ రకాల సాహిత్యాన్ని, భావజాలాన్ని ప్రచురిస్తూనే వున్నాయి. వార, మాస, నిర్ణీతకాల పత్రికలతో పాటు, కుల, మత, లింగ ప్రాతిపదికన మరికొన్ని పత్రికలు ముద్రితమవుతున్నాయి. సామాజిక, రాజకీయ, సినిమా, ఆర్థిక సాంస్కృతిక, సాహిత్య పత్రికల ప్రచురణ కూడా కొనసాగుతుంది. వీటిలో కొన్ని ముద్రితం కాగా, మరికొన్ని ఆన్‌లైన్, డిజిటల్ ఎలక్ట్రానిక్ పత్రికలుగా వున్నాయి. ఇవన్నీ తెలుగుభాషా వికాసానికి మకుటంగా నిలుస్తున్నాయనే చెప్పాలి.

తెలుగు భాషను పరిరక్షించాలనే సంకల్పం కలిగిన ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో 'తెలుగు జర్నలిజం' కోర్సుని ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల్లోని జర్నలిజం కోర్సులను పరిశీలించిన తర్వాత విద్యారంగానికో లేదా మీడియా రంగానికో చెందిన వారిలో ఈ ఆలోచన మరింత బలపడుతుంది. తమిళం, మలయాళం, కన్నడ, ఉర్దూ, ఒరియా, హిందీ, గుజరాతీ, మరాఠీ మొదలైన భాషల్లో ఆయా రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాలు భాషాప్రాతిపదికన జర్నలిజం కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఇవి ఆయా రాష్ట్రాల ఉన్నత విద్యా రంగంలో ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించాయి. ఉద్యోగ అవకాశాలకు దారి చూపుతున్నాయి. అక్కడి సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిస్థితుల్ని ఆవిష్కరిస్తున్నాయి. అనువాద పుస్తకాలు వెలువడుతు న్నాయి. మేధో వర్గం తెలుగు జర్నలిజం చరిత్ర మీద అవగాహన కలిగి ప్రాంతీయ భాషల్లో జర్నలిజం విద్య అవసరాన్ని గుర్తించాల్సి వుంది. దేశంలో అనేక విశ్వ విద్యాలయాల్లో ప్రాంతీయ భాషల్లో జర్నలిజం కోర్సులు ఎప్పటి నుంచో సాంప్రదాయ కోర్సులుగా కొనసాగుతున్నాయి. ఈ కోర్సుల్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆనాడే గుర్తించింది. ఇదిలా వుండగా మన రాష్ట్రంలో విజయవం తంగా నడుస్తున్న ఈ కోర్సులను గత వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిన సందర్భాలు వున్నాయి. ప్రత్యేకించి 2019-20 విద్యాసంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్, తెలుగు రెండు మాధ్యమాల్లో పీజీ డిప్లమా కోర్సు ప్రారంభి ఒక్క ఏడాదిలోనే ఎత్తేసింది. ఇటువంటి నిర్ణయాలపై ఉన్నత విద్యాశాఖకు, మండలికి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు మొరపెట్టుకున్నా, మీడియాకి ఎక్కినా కనీసం పట్టించుకోలేదు. పైగా బాధితుల్ని అణచివేశారు. జర్నలిజం విలువలు మంటగలిసిపోతున్నాయని గుండెలు బాదుకుంటున్న విమర్శకులు జర్నలిజం విద్య గురించి కూడా మాట్లాడితే బాగుంటుంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ, మొబైల్ : 9393 111740

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 5

చంద్ర రాజేశ్వరరావు

ఆర్వీ రామారావ్

ఒక వ్యక్తి చూపులకు, గుణగణాలకు, స్వభావానికి సంబంధం ఉండనక్కర్లేదనడానికి చంద్ర రాజేశ్వరరావు మంచి ఉదాహరణ. ఆయనది ఎత్తైన విగ్రహం. విశాలమైన ముఖం. గంభీరమైన గొంతు. ఆ పంచె కట్టు, నడిచే తీరు, మాటలో ఓ రకమైన కరకుదనం ఆయనలోని నిశిత దృష్టిని, మేధో శక్తిని, మానవీయ లక్షణాలను కప్పి పెట్టేవి. ఎవరితోనైనా నేరుగా కళ్లల్లోకి కళ్లు పెట్టి చూసే మనిషి చంద్ర రాజేశ్వరరావు. ఆయన ఎం.బి.బి.ఎస్. పూర్తి చేయకుండానే వదిలేశారని, అంతకు ముందు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పట్టభద్ర స్థాయి విద్య కూడా పూర్తి చేయకుండా బయటకు వచ్చారని చాలామందికి తెలియకపోవచ్చు.

35 ఏళ్లకే ఒక జాతీయ పార్టీకి అధినేత అయింది ఒక్క రాజేశ్వరరావు మాత్రమే. 1950-51 లో ఆయన రణదివే తరవాత సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అది కమ్యూనిస్టు పార్టీకి ఒక రకంగా కల్లోల సమయం. ఆ తరవాత సీపీఐ చీలిపోయిన తరవాత 1964 లో మళ్లీ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1990 దాకా ఆ స్థానంలో కొనసాగారు.

అంత ఎక్కువ కాలం అగ్ర నాయకుడిగా ఉండడం రాజేశ్వరరావుకు ఒక్కడికే చెల్లిందేమో. కృష్ణా జిల్లా మంగళాపురంలో సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించినా తన యావదాస్తిని సీపీఐకి విరాళంగా ఇచ్చేశారు. అతి సాధారణ కార్యకర్తతో కూడా ఆప్యాయంగా మాట్లాడేవారు. పార్టీ కార్యాలయంలోని గేటు దగ్గర ఉండే రెడ్ గార్డుతో, కసవు ఊడ్చే వారిని కూడా ఆత్మీయంగా పలకరించే వారు. వారి మంచి చెడ్డలు కనుక్కునే వారు. అవసరమైన సహాయం చేసేవారు. కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘ కాలం అగ్ర నాయకుడిగా ఉన్నా ఆయన నడవడికలో ఎన్నడూ దర్పం కనిపించలేదు.

రాజేశ్వరరావుకు సెక్యులరిజం అంటే ఒక ప్రదర్శనాంశం కాదు. సెక్యులరిజం నరనరానా జీర్ణించుకు పోయిన వాడాయన. బాబరీ మసీదు వివాదం కొనసాగుతున్నప్పుడు ఆయన కలత చెందారు. బాబరీ మసీదు ప్రాంతాన్ని ఒక మ్యూజియంగా మార్చాలని సూచించారు.

రోజువారీ జీవితంలో ఆయన అనుసరించిన విధానం అత్యంత నిరాడంబరమైంది. ఏ సుఖాలూ కోరుకోకుండానే జీవితం అంతా గడిపేశారు. తాను ఉండే గదిలో కూలర్లు, ఏర్ కండిషనర్లు ఉండాలని ఎప్పుడూ అనుకోలేదు. అత్యంత సామాన్యంగా బతికేవారు.

ఆయన మేటి దేశభక్తుడు. కమ్యూనిస్టు కనక ఆయన తిరుగులేని దేశభక్తుడు. పంజాబ్ లో తీవ్ర వాదం ఆయనను కుదిపేసింది. దానికి మూలాలేమిటో తెలుసుకోవడానికి సిక్కు మతం గురించి అపారంగా చదివారు. సిక్కు మేధావులతో సుదీర్ఘమైన చర్చలు జరిపారు. అస్సాం, మణిపూర్ కల్లోలాలను కూడా ఆయన నిశితంగా పరిశీలించేవారు.

కుల మతాల పేర సంకుచిత మానసిక ధోరణులు ఆయనకు నచ్చేవి కావు. దేశంలోని వైవిధ్యతను తెలుసుకోవడం కోసం చంద్ర అన్ని ప్రయత్నాలూ చేశారు. పార్సీ మతం గురించి కూడా ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. మార్క్సిజానికీ సుసంపన్నమైన భారతీయ సామాజిక, సాంస్కృతిక అంశాలతో బంధం ఉండాలని ఆకాంక్షించేవారు. మన సంస్కృతిలోని తిరోగమన అంశాలను వదిలించుకుని ప్రగతిశీలమైన సకల అంశాలను ఇముడ్చుకుని ముందుకు సాగాలన్నది ఆయన ఆకాంక్ష.



చంద్ర రాజేశ్వరరావు

చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో సాగిన పోరాటం చరిత్రాత్మకమైంది. పేదరికం బాధ తీరాలంటే భూసంస్కరణలు ఒక్కటే మార్గం అని నమ్మిన కార్యవాది రాజేశ్వరరావు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభం కాక ముందే 11వ ఆంధ్ర మహాసభకు చంద్ర రాజేశ్వరరావు హాజరయ్యారు. ఆ తరవాత ఆయన సాయుధ పోరాటంతో మమేకమయ్యారు. సాయుధ పోరాట లక్ష్యాలు నెరవేరిన తరవాత ఆ పోరాటాన్ని కొనసాగించాలని అప్పటి సీపీఐ కేంద్ర నాయకత్వం భావించింది. కానీ వాస్తవ పరిస్థితులు తెలుసు కాబట్టి అజ్ఞాతంగా ఉన్న కార్యకర్తలను కలుసుకుని సాయుధ పోరాటం విరమించవలసిన ఆవశ్యకతను వివరించిన తీరు నిరుపమానమైంది. వామపక్ష పార్టీల ఐక్యత ఎంత ప్రధానమైందో ఆయన ఆవేదనతో విడమర్చేవారు.

రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం విడివిడిగా ఉండాలని చంద్ర భావించేవారు. అందుకే అఖిల భారత రైతు సంఘంలో అంతర్భాగంగా ఉన్న వ్యవసాయ కూలీల కోసం 1968 లో వ్యవసాయ కూలీల సంఘాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు.

రణదివే ప్రధాన కార్యదర్శిగా ఉండగా అనుసరించిన విధానాలు కమ్యూనిస్టు పార్టీని అతలాకుతలం చేశాయి. ఆ దశలో నాయకత్వం చేపట్టింది రాజేశ్వరరావే. 1964లో సీపీఐ చీలిపోయినప్పుడు మళ్లీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టింది ఆయనే. పార్టీ చీలిక తరవాత రాజేశ్వరరావు రెండవ సారి సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దిగజారుతున్న ఆరోగ్యం కారణంగా 1989 లో జరిగిన పార్టీ మహా సభలోనే ఆయన తప్పుకోవాలనుకున్నారు. కానీ ఆ మహాసభలో మళ్లీ ఆయననే ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 1990 లో ప్రధాన కార్యదర్శి బాధ్యతలు వదులుకున్నారు. చివరకు 1992 లో పార్టీలో అన్ని బాధ్యతల నుంచి తప్పుకున్నారు.

1993 నవంబర్‌లో ఆయన వీలునామా రాశారు. ఆ వీలునామాలో తాను ఎవరి దగ్గరా ఏమీ తీసుకోలేదని, తాను ఎవరికీ ఇవ్వాల్సింది ఏమీ లేదని రాజేశ్వరరావు రాశారు. తన పుస్తకాలు పార్టీకి, బట్టలు అవసరమైన వారికి ఇవ్వాలని రాశారు. ఇది ఆయన నిరాడంబరతకు నిదర్శనం. ఆయన అనుసరించే వైఖరిని, విధానాలను ఎంత తీవ్రంగా వ్యతిరేకించినా ఓపికగా వారి వాదనను సంపూర్ణంగా వినడం రాజేశ్వరరావు లక్షణం. హరిజనులు, గిరిజనులు, మైనారిటీల మీద ఎక్కడ దాడి జరిగినా ఆయన వెంటనే స్పందించేవారు. తానే స్వయంగా వెళ్లి దాడికి గురైన వారిని పరామర్శించి అవసరమైన సహాయం చేసేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సమైక్యం కావాలన్న ఆయన ఆకాంక్ష ఇప్పటికీ నెరవేరలేదు. నంద్యాలలో ఒక రాజకీయ సమావేశంలో చంద్ర రాజేశ్వరరావు మొట్టమొదటి సారి శ్రీశ్రీని "మహా కవి" అని సంబోధించారు.

వక్ఫ్ సవరణ బిల్లు దేశ సమగ్రతకు విఘాతం

లోక్‌సభలో విరుచుకుపడిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లు దేశ సమగ్రతకు విఘాతమని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మతపరమైన అంశాల్లో జోక్యం చేసుకుంటోందని, రాజ్యాంగంలో జాతీయవాదం పొందుపరచబడిందని అన్నారు. బుధవారం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లుని ప్రవేశపెట్టగా... ఈ బిల్లుపై చర్చ సందర్భంగా గొగోయ్ మాట్లాడుతూ.. ఈ బిల్లును మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రూపొందించిందా లేదా మరేదైనా శాఖ రూపొందించిందా అని ప్రశ్నించారు. ఈ బిల్లు ఎక్కడి నుండి వచ్చింది మన దేశంలో మైనారిటీల పరిస్థితి ఎలా ఉందంటే .. నేడు ప్రభుత్వం వారి మతానికి సంబంధించి సర్టిఫికేట్ జారీ చేస్తోందని అన్నారు. మీరు ఐదేళ్లు పూర్తి చేశారా లేదా అని ఇతర మతాల వారిని సర్టిఫికేట్ గురించి అడుగుతారా అని ప్రశ్నించారు. మతం విషయంలో ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకుంటోందని నిలదీశారు. ప్రతి వ్యక్తి రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం పొందాలని, భావప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ ఉండాలని మన రాజ్యాంగం సూచిస్తోందని అన్నారు. ఈ బిల్లు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంపై దాడిగా ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లు పేరుతో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అన్నారు. మైనారిటీ కమ్యూనిటీని కించపరచాలనుకుంటున్నారని, భారతీయులను విడదీయాలనుకుంటున్నారని మండిపడ్డారు. యూపీఏ ప్రభుత్వం గురించి కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తప్పు దారిపట్టించేవని, దానికి ప్రామాణికత చూపాలని డిమాండ్ చేశారు. కొద్ది రోజుల క్రితం వారి డబుల్ ఇంజిన్ సర్కార్ రోడ్లపై నమాజ్ చేసేందుకు కూడా అనుమతించలేదని అన్నారు. మైనారిటీల పట్ల సానుభూతి చూపుతున్నామని చెప్పుకుంటున్నారని, కానీ మైనారిటీ వర్గాల నుండి ఎంతమంది ఎంపిలు ఉన్నారని తాను ప్రశ్నించాలనుకుంటున్నాని అన్నారు.

రాజ్యాంగం, సమాఖ్యవాదంపై దాడి: కేసీ వేణుగోపాల్

ఎన్డీఏ ప్రభుత్వం చట్టాన్ని బుల్డోజ్ చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లుని తొందరపాటుతో ఆమోదిస్తోందని, సవరణలను ప్రతిపాదించే అవకాశం కూడా సభ్యులకు నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఈ బిల్లు రాజ్యాంగం, సమాఖ్య వాదంపై దాడిగా ఆయన అభివర్ణించారు. 'మీరు సభలోకి తీసుకువస్తున్న ఈ రకమైన బిల్లు (వక్ఫ్ సవరణ బిల్లు)లో కనీసం సభ్యులు సవరణలు చేసే అధికారం కలిగి ఉండాలి. కానీ మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఈబిల్లుని సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సభ్యులు సవరణలను ప్రతిపాదించడానికి తగిన సమయం లేకుండా పోయింది. చట్టాలను కూడా బుల్డోజ్ చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు. అయితే ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల సవరణలను సమానంగా పరిగణనలోకి తీసుకున్నామని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. బిల్లుపై ప్రభుత్వం అనుసరించిన విధానంపై రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) ఎంపి ఎన్.కె. రామచంద్రన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లులో చేసిన సవరణలను కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందని హెూంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. సవరణలు జెపిసి నివేదిక ఆధారంగా జరిగాయని అన్నారు.

లౌకికతత్వానికి ముప్పు: అఖిలేశ్

సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ... వక్ఫ్ సవరణ బిల్లు విభజనకు ఉద్దేశించబడిందని, దేశ లౌకిక ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రపంచానికి తప్పుడు సందేశాన్ని పంపుతుందన్నారు. బీజేపీ 'తగ్గుతున్న' ఓటు బ్యాంకును కాపాడుకునేందుకే ఈ బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. కొంతమంది సభ్యులు బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పుకోవచ్చు కానీ లోపల వారు ఈ చర్య పట్ల సంతోషంగా లేరని అన్నారు. మహాకుంభ్‌లో జరిగిన మరణాలు, చైనా భూ ఆక్రమణ నుంచి దృష్టిని మళ్లించడానికి ఈ బిల్లును తీసుకువస్తున్నారని కన్నౌజ్ ఎంపీ తెలిపారు. 'వక్ఫ్ బిల్లును తీసుకురావడం బీజేపీ రాజకీయ క్రీడ. ఇది వారి మత రాజకీయాలకు కొత్త రూపం. బీజేపీ తన విధానాల కారణంగా ఇప్పుడు పార్టీ నుంచి తమను తాము దూరం చేసుకుంటున్న మద్దతుదారులను శాంతింపజేయాలని కోరుకుంటోంది' అని అన్నారు. కేంద్రం ఎటువంటి వ్యూహాలనూ ఉపయోగించి వక్ఫ్ భూమిని ఇతర ప్రయోజనాల కోసం ఇవ్వబడదని హామీ ఇవ్వాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. 'వక్ఫ్ సవరణ బిల్లు వెనుక ఉన్న విధానం లేదా ఉద్దేశం రెండూ సరైనవి కావు. ఇది కోట్లాది మంది ప్రజల భూములు, ఇళ్లను లాక్కోవడానికి చేసిన కుట్ర. బీజేపీ ఒక అప్రజాస్వామిక పార్టీ. అది అసమ్మతిని తన బలంగా భావిస్తోంది. దేశంలోని మెజారిటీ రాజకీయ పార్టీలు దీనికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం ఈ బిల్లును తీసుకురావాలని ఎందుకు పట్టుబడుతోంది' అని ఆయన ప్రశ్నించారు.

- డీఎంకే ఎంపీ ఎ.రాజా మాట్లాడుతూ 'లోక్‌సభలో ముస్లిం సభ్యుడు లేని పార్టీ మైనారిటీల హక్కులను కాపాడబోతోందనేది హాస్యాస్పదం' అని అన్నారు, 'ఈ లౌకిక దేశం రాజ్యాంగ పితామహులు బాగా రాసిన మార్గంలో ప్రయాణించబోతోందా లేదా దేశంలోని మతతత్వ శక్తులు నిర్ణయించిన ప్రతికూల మార్గంలో ప్రయాణించబోతోందా అనేది మన గమ్యాన్ని నిర్ణయించడానికి భారత పార్లమెంటుకు ఈ రోజు ఒక అద్భుతమైన రోజు' అని ఆయన అన్నారు.
- శివసేన (యూబీటీ) సభ్యుడు అరవింద్ సావంత్ మాట్లాడుతూ జేపీసీ కార్యకలాపాల నిర్వహణపై కేంద్రాన్ని విమర్శించారు. 'నేను కూడా జేపీసీ సభ్యుడిని. దురదృష్టవశాత్తు, చివరి వరకు, జేపీసీలో నిబంధనల వారీగా చర్చలు జరగలేదు. భాగస్వాములు కాని వారిని కూడా జేపీసీకి పిలిచారు' అని అన్నారు. బీజేపీ రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై మాత్రమే దృష్టి సారించిందని, దాని మాటలకు, చర్యలకు మధ్య పొంతన లేదని విమర్శించారు.
- టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ వక్ఫ్ భావనను సమర్థించారు. బిల్లును వ్యతిరేకించారు. ఆయన వక్ఫ్‌ను 'ప్రధాన విశ్వాసం', ఇస్లాంకు చెందిన 'అంతర్భాగం' అని అభివర్ణించారు. ఒక వ్యక్తి ఆస్తిని వక్ఫ్‌కు అంకితం చేసే ముందు కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాంను ఆచరిస్తూ ఉండాలని ఆదేశించే సవరణను ఆయన విమర్శించారు. ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధమని, ఏకపక్షమని అన్నారు. ఇది ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తుందని తెలిపారు. ఇది దేశ లౌకిక నిర్మాణాన్ని ఉల్లంఘిస్తుందని ఆయన అన్నారు.

అమిత్‌షా... అఖిలేశ్ మధ్య వ్యంగ్యాస్త్రాలు

వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించుకున్నారు. బీజేపీ అధ్యక్ష ఎన్నిక గురించి అఖిలేశ్ సెటైర్ వేయగా... అమిత్‌షా అంతే దీటుగా బదులిచ్చారు. వివరాల్లోకి వెళితే... వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ... 'ప్రపంచంలో అతిపెద్ద పార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోంది' అని బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. 'అఖిలేశ్‌జీ నవ్వుతూ ఓ విషయం వెల్లడించారు. నేను కూడా నవ్వుతూనే సమాధానం ఇస్తాను. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లో ఉంటుంది. దీంతో ఆ ఐదుగురి నుంచే అధ్యక్షుడిని నియమించుకుంటారు. కానీ మేం ఒక ప్రక్రియను పాటించాలి. 12 నుంచి 13 కోట్ల పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు సమయం పట్టదు. ఎందుకంటే మరో 25 ఏళ్లు మీరే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారు. అందులో మార్పేమీ ఉండదు' అని అమిత్‌షా బదులిచ్చారు.

ఈ బిల్లు లేకపోతే.. పార్లమెంట్ భూమినీ వక్ఫ్ ఆస్తి అంటారు: ప్రతిపక్షాలపై రిజిజు విమర్శలు

అంతకుముందు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకువచ్చింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభలో ప్రసంగించారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదన్నారు. "పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి.

మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదని, ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమేనన్నారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేవారు, వ్యతిరేకించేవారు ఎప్పటికీ గుర్తుండిపోతారని చెప్పారు.

కిడ్నీ రూ.75 వేలు, కాలేయం రూ.90 వేలు

అప్పులు తీర్చడానికి అవయవాలు అమ్మకానికి పెట్టిన రైతు

ముంబై: పంట దిగుబడి లేక, పెట్టుబడులు రాక అప్పులపాలైన రైతు తన అవయవాలను అమ్మకానికి పెట్టాడు. కిడ్నీ రూ.75,000, కాలేయం రూ.90,000, కళ్లు రూ.25,000కు అమ్ముతానంటూ మెడలో వేసుకున్న ప్లకార్డును ప్రదర్శించాడు. మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. వివరాలివి. అదోలి గ్రామానికి చెందిన సతీశ్ ఐదోలు వ్యవసాయంలో నష్టపోయాడు. దీంతో బ్యాంకు రుణాలు తీర్చలేకపోయాడు. ఈ నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంపై వినూతన్నంగా నిరసన తెలిపాడు. 'రైతుల అవయవాలు కొనండి' అని రాసి ఉన్న ప్లకార్డును మెడలో ధరించాడు. తన కిడ్నీలను రూ. 75,000కు, కాలేయాన్ని రూ. 90,000కు, కళ్లు రూ. 25,000కు అమ్ముతానని అందులో పేర్కొన్నాడు. కాగా, రైతు రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు దేవేంద్ర ఫడ్నవీస్ హామీ ఇచ్చారని, ఇప్పుడు రైతులే ఆ అప్పులు చెల్లించాలని చెబుతున్నారని రైతు సతీశ్ విమర్శించాడు. తమ వద్ద డబ్బు లేనప్పుడు ఎలా చెల్లించగలం అని నిలదీశాడు. నా అవయవాలు అమ్ముకోవడం తప్ప మరో మార్గం లేదని వాపోయాడు. తన శరీర భాగాలు అమ్ముకున్నప్పటికీ అప్పు తీరదని వాపోయాడు.

అందుకే తన కుటుంబ సభ్యుల అవయవాలు కూడా అమ్మకానికి పెట్టినట్లు చెప్పాడు. భార్య కిడ్నీని రూ. 40,000, కొడుకు కిడ్నీ రూ.20,000, చిన్న బిడ్డ కిడ్నీ రూ.10,000కు అమ్ముతానని అన్నాడు. ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని నెరవేర్చలేదని ఆరోపించాడు. రైతు రుణ మాఫీ హామీని నిలబెట్టుకోవాలని సతీశ్ కోరాడు. ఈ మేరకు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఒక లేఖ రాశాడు. దీనిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డిజిటల్ అరెస్ట్... రూ.3.4 కోట్ల దోపిడీ

మోసపోయిన రిటైర్డ్ కల్నల్ దంపతులు

చండీగఢ్ : దేశంలో రోజురోజుకు డిజిటల్ అరెస్టుల మోసాలు పెరిగిపోతున్నాయి. తాజాగా చండీగఢ్‌లో డిజిటల్ అరెస్టు వల్ల రిటైర్డ్ కల్నల్ దంపతులు సుమారు రూ.3.4 కోట్ల డబ్బును కోల్పోయారు. వివరాల్లోకి వెళితే... చండీఘడ్‌లోని సెక్టార్ 2ఏలో నివాసం ఉంటున్న 82 ఏళ్ల రిటైర్డ్ కల్నల్ దలీప్ సింగ్, ఆయన భార్య రవీందర్ కౌర్ బాజ్వాను ఈడీ అధికారులమంటూ మోసం చేశారు. తొలుతవాట్సాప్ వీడియో కాల్స్ చేసి బెదిరించారు. ఆ తర్వాత కోర్టు నోటీసులు ఇచ్చి భయానికి గురి చేసినట్లు తెలిసింది. చండీగఢ్ సైబర్ సెల్‌లో ఆ వృద్ధ జంట ఫిర్యాదు చేసింది. ఈడీ అధికారులమని తమ వద్ద సేవింగ్స్ రూపంలో ఉన్న సుమారు 3.4 కోట్ల డబ్బును సైబర్ మోసగాళ్లు కాజేసినట్లు దంపతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు. మార్చి 18వ తేదీన సింగ్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. ముంబైలోని కెనరా బ్యాంక్‌తో ఉన్న అకౌంట్‌తో మనీ లాండరింగ్ లింకు ఉన్నట్లు ఆ కాల్‌తో సింగ్‌ను బెదిరించారు. జెట్ ఎయిర్‌వేస్ ఓనర్ నరేశ్ గోయల్‌కు మనీ లాండరింగ్ చేసినట్లు సైబర్ నేరగాళ్లు ఆరోపించారు. ముంబైలో దలీప్ సింగ్ బజ్వా పేరుతో అకౌంట్ ఉన్నట్లు ఆయన భార్యకు నేరగాళ్లు ఫోన్ చేసి... సింగ్ పేరుతో ఉన్న కార్డును చూపించి రూ.5 వేల కోట్ల అవకతవకలతో సంబంధం ఉన్నట్లు బెదిరించారని కౌర్ పేర్కొంది. మార్చి 18 నుంచి 27వ తేదీ వరకు సైబర్ నేరగాళ్లు ఆ వృద్ధ దంపతులను డిజిటల్ అరెస్ట్ చేశారు. ఫోన్లు ఎప్పటికీ ఆన్‌లో పెట్టుకోవాలని ఆ జంటను హెచ్చరించారు. ఎవరినీ కలుసుకోవద్దని అన్నారు. విషయం బయటకు తెలిస్తే అరెస్టు చేస్తామని బెదిరించారు.

సుప్రీం కోర్టు లెటర్ ప్యాడ్‌తో ఉన్న లేఖలను కొన్ని చూపించారు. అయితే తీవ్ర వత్తిడికి లోనైన ఆ జంట... తమ అకౌంట్లలో దాచుకున్న 3.4 కోట్లను సైబర్ నేరగాళ్లకు చెందిన వివిధ అకౌంట్లకు బదిలీ చేశారు. తన ఇద్దరు కుమారులను కోల్పోయిన దలీప్ సింగ్ ప్రస్తుతం కోడలు, మనవరాళ్లతో కలిసి ఉంటున్నారు. యువకుడిగా దేశ సేవకే జీవితాన్ని అంకితం చేశానని, వృద్ధాప్యంలో సైబర్ నేరగాళ్ల మోసానికి దాచుకున్న డబ్బు కోల్పోయినట్లు బాధపడ్డారు.

పారిశుద్ధ్య కార్మికుడికి రూ.34 కోట్ల పన్ను నోటీసు

న్యూఢిల్లీ : కేవలం రూ.15 వేల జీతం సంపాదిస్తున్న ఒక పారిశుద్ధ్య కార్మికుడు ఆదాయ పన్ను విభాగం అధికారుల నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు. రూ.34 కోట్ల పన్ను చెల్లించాలంటూ అందులో పేర్కొనడంతో దిగ్భ్రాంతికి గురై పోలీసులను ఆశ్రయించాడు. ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన కరణ్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే అతనికి ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి నోటీసులు అందాయి. కానీ వాటిలో ఏముందో అతడికి అర్థం కాకపోవడంతో తోటివారి సహాయంతో విషయం తెలుసుకున్నాడు. వారి చెప్పిన లెక్కలతో తీవ్ర ఆందోళనకు గురైన అతను వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. '2019-2020లో కరణ్ రూ.34 కోట్ల ఆదాయాన్ని పొందారు. ఆ ఏడాదికి ఎలాంటి రిటర్న్ ఫైల్ చేయలేదు' అని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ కరణ్ కుమార్ మాత్రం ఆగ్రాలోని ఖైర్‌లో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. తన జీతం రూ.15 వేలని వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే అతని పాన్ కార్డ్ వివరాలను ఎవరైనా దుర్వినియోగం చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాను గతంలో పనిచేసిన యజమానికి తన పాన్ వివరాలు, గుర్తింపు పత్రాలు సమర్పించిన విషయాన్ని కరణ్ గుర్తుచేసుకున్నారు. ఇటీవల అలీగఢ్‌కు చెందిన జ్యూస్ సెంటర్ వ్యాపారికి రూ.7.5 కోట్లు చెల్లించాలని నోటీసులు అందిన సంగతి తెలిసిందే.

కపిల్ మిశ్రా రాజీనామాకు డిమాండ్

ఢిల్లీ అసెంబ్లీ నుంచి ఆప్ ఎమ్మెల్యే సస్పెన్షన్

న్యూఢిల్లీ : కొత్తగా ఏర్పాటయిన ఎనిమిదవ అసెంబ్లీ తొలి బడ్జెట్ సమావేశాల చివరి రోజు ఢిల్లీ న్యాయ శాఖ మంత్రి కపిల్ మిశ్రా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆప్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. 2020 ఢిల్లీ అల్లర్లలో మిశ్రా పాత్రపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించిన ఒక రోజు తర్వాత ఈ నిరసన చోటుచేసుకుంది. ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ ఆప్ శాసనసభ్యులు సభ వెల్‌లోకి దూసుకు వెళ్లారు. దీంతో స్పీకర్ విజేందర్ గుప్తా... ఆప్ సభ్యుల్లో కుల్దీప్ కుమార్, సంజీవ్ ఝా, ముఖేష్ అహ్లావత్, సురేంద్ర కుమార్, జర్నైల్ సింగ్, ఆలే మహమ్మద్, అనిల్ ఝాను సస్పెండ్ చేశారు. నిరసనలకు నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్ష నాయకురాలు ఆతిశీ మాట్లాడుతూ బీజేపీ కపిల్ మిశ్రాను కాపాడుతోందని ఆరోపించారు. 'అల్లర్లలో నిందితులందరూ జైలులో ఉన్నారు. కపిల్ మిశ్రా ఎందుకు జైలులో లేరు? మేము ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తున్నాం. కానీ బీజేపీ మిశ్రాను రక్షిస్తోంది' అని ఆమె పీటీఐతో అన్నారు. సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు ఆవరణలోనే ఉండి, సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ తమ నిరసనను కొనసాగిస్తున్నారా లేదా అని ధ్రువీకరించుకోవాలని స్పీకర్ గుప్తా అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించారు. మార్చి 3న జరిగిన ఎనిమిదవ అసెంబ్లీ మొదటి సమావేశంలో స్పీకర్ గుప్తా... సస్పెండ్ చేయబడిన లేదా మార్షల్ చేయబడిన ఏ ఎమ్మెల్యే అయినా విధానసభ ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయాలని తీర్పు ఇచ్చారు. కాగా, మిశ్రాపై దర్యాప్తు కోసం 'ప్రాథమిక సాక్ష్యం' కేసును కనుగొన్న అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా మంగళవారం ఇచ్చిన తీర్పు తర్వాత ఈ నిరసన జరిగింది. ఏప్రిల్ 16 నాటికి సమ్మతి నివేదికను దాఖలు చేయాలని కోర్టు ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. 2020 యమునా విహార్ నివాసి మొహమ్మద్ ఇలియాస్ ఫిర్యాదు చేశారు. ఈ అల్లర్లలో 53 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు.

ఆన్‌లైన్ బెట్టింగ్... మాజీ సీఎం బఘేల్‌పై కేసు



రాయ్‌పూర్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. బెట్టింగ్ యాప్ కుంభకోణం లబ్ధిదారుల్లో బఘేల్ ఒకరని సీబీఐ తెలిపింది. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా తన ఎఫ్ఐఆర్ లో ఇదే విషయాన్ని పొందుపరిచింది.కాగా, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో భూపేశ్ బఘేల్ పై భారత శిక్షాస్మృతిలోని 120-బి (నేరపూరిత కుట్ర), మోసం (420), ఛత్తీస్‌గఢ్ జూద నిషేధ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో బఘేల్‌ను 19 మంది నిందితుల్లో ఆరో వ్యక్తిగా పేర్కొంది. కాగా, సీబీఐ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను బఘేల్ ఖండించారు. ఇవన్నీ తప్పుడు ఆరోపణలని అన్నారు. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని రాజకీయ ప్రేరేపిత చర్యగా అభివర్ణించారు. ఈ కేసులో సీబీఐ గతేడాది డిసెంబర్ 18న ఎఫ్ఐఆర్ నమోదు చేసి, మార్చి 26న బఘేల్ నివాసంలో సోదాలు చేసింది. తాజాగా ఏప్రిల్ 1న సీబీఐ ఎఫ్ఐఆర్‌ను బహిరంగపర్చింది. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తును సిఫార్సు చేసింది. దీంతో కేంద్ర ఏజెన్సీ దర్యాప్తు చేపట్టి తుది నివేదికను ప్రత్యేక కోర్టుకు సమర్పించనుంది.

డీలిమిటేషన్ సెగ...

ప్రధాని మోదీకి స్టాలిన్ లేఖ

చెన్నై : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం దక్షిణాది రాష్ట్రాల్లో సెగలు రేపుతోంది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టవద్దని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఇటీవలే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక పార్టీలు సమావేశం నిర్వహించి తీర్మానం చేశాయి. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సమర్పించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సిద్ధమయ్యారు.

ఇందుకోసం ప్రధాని మోదీని కలిసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి మార్చి 27వ తేదీన తాను రాసిన లేఖను స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై గత నెల 22న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాల జేఏసీ సమావేశమైంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించేది లేదని ఈ సమావేశంలో తీర్మానించారు. రెండో సమావేశంలో హైదరాబాద్‌లో జరుగుతుందని స్టాలిన్ తెలిపారు.

వక్ఫ్ బిల్లును కోర్టులో సవాలు చేస్తాం

ఏఐఎంపీఎల్‌బీ స్పష్టీకరణ... నిరసనలకు ప్రణాళిక

న్యూఢిల్లీ : ముస్లిం సమాజ హక్కులను హరించే 'నల్ల చట్టం' అని పేర్కొంటూ, వక్ఫ్ (సవరణ) బిల్లును కోర్టులో సవాలు చేస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) బుధవారం ప్రకటించింది. అవసరమైతే, దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని కూడా ఆ సంస్థ ప్రతిజ్ఞ చేసింది. విలేకరుల సమావేశంలో ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు మొహమ్మద్ అదీబ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ముస్లిం ఆస్తులను లాక్కోవడానికి చేసిన ప్రయత్నం అని అన్నారు. 'వారు మా ఆస్తిని లాక్కోవచ్చన్న ఉద్దేశంతో ఈ చర్య ప్రారంభించారు. దీన్ని అంగీకరించవచ్చా? మేము ఓడిపోయామని అనుకోవద్దు' అని అన్నారు. ప్రతిపాదిత సవరణలను సమీక్షించిన పార్లమెంటు సంయుక్త కమిటీ (జేపీసీ) చర్చల సమయంలో బిల్లును వ్యతిరేకించినట్లు తెలిపారు. 'మనం యుద్ధంలో ఓడిపోయామని భావించకూడదు. మనం ఇప్పుడే ప్రారంభించాం. ప్రతిపాదిత చట్టం భారతదేశ నిర్మాణాన్నే ప్రమాదంలో పడేస్తుంది. అందువల్ల దేశాన్ని కాపాడటానికి చేస్తున్న పోరాటం' అని అదీబ్ అన్నారు. మనస్సాక్షి ఉన్న పౌరులందరూ బిల్లును వ్యతిరేకించాలని అదీబ్ కోరారు. కోర్టులో, ప్రజా ప్రదర్శనల ద్వారా దానిపై పోరాడటానికి ఏఐఎంపీఎల్‌బీ నిబద్ధతను పునరుద్ఘాటించారు. 'మేము కోర్టుకు వెళ్తాము. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు మేము విశ్రమించము' అని ఆయన అన్నారు. ఏఐఎంపీఎల్‌బీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అలీ మొహసిన్ కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిని 'వివక్షత, మతపరంగా ప్రేరేపించబడినది. ముస్లిం పౌరుల రాజ్యాంగ హక్కులపై స్పష్టమైన ఉల్లంఘన' అని అభివర్ణించారు. 'దేశాన్ని కాపాడాలనే ఉద్దేశంతో మేము ఈ పోరాటాన్ని ప్రారంభించాం. ఈ నల్ల చట్టాన్ని అంతం చేయడమే మా లక్ష్యం' అని మోహసిన్ అన్నారు. రైతుల ఆందోళన మాదిరిగానే దేశ వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తామని బోర్డు సభ్యులు తెలిపారు.

'రైతుల మాదిరిగానే మేము దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. అవసరమైతే, బిల్లును వ్యతిరేకించడానికి మేము రోడ్లను దిగ్బంధించి అన్ని శాంతియుత చర్యలు తీసుకుంటాం' అని ఆయన చెప్పారు. ఈ బిల్లు భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛ, సమానత్వం, న్యాయాన్ని దెబ్బతీస్తుందని ఏఐఎంపీఎల్‌బీ వాదిస్తోంది.

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్కే!

ఫోర్బ్స్ జాబితా 18వ స్థానంలో అంబానీ... అదానీకి 28వ స్థానం

న్యూఢిల్లీ : ఫోర్బ్స్ బిలియనీర్ల తాజా జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో అగ్ర స్థానం దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు. ఇక ఈ జాబితాలో అమెరికా అగ్ర స్థానంలో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా... భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపార వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. ఇక ఈసారి 288 మంది కొత్త వ్యక్తులు ఫోర్బ్స్ జాబితాలో చేరారు. వీరిలో అనేక మంది హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

భారతీయ అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్

ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో అత్యంత సంపన్న భారతీయ మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. టాప్ టెన్ ఇండియన్ బిలియనీర్ల జాబితాలో ఆమె మూడవ స్థానంలో ఉన్నారు. ఓపీ జిందాల్ గ్రూపు యజమానిగా ఆమె ఉన్నారు. ప్రస్తుతం ఆమె హర్యానాలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఫోర్బ్స్ బిలియనీర్స్ 2025 జాబితాలో ఆమె ఆస్తుల విలువ సుమారు 35.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ తర్వాత ఆ జాబితాలో సావిత్రి మూడవ స్థానంలో ఉన్నారు. టాప్ 10 భారత బిలియనీర్లలో ఉన్న ఏకైక మహిళగా నిలవడం విశేషం. స్టీల్, పవర్, సిమెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి. ఆ గ్రూపునకు సావిత్రి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆమె భర్త ఓం ప్రకాశ్ జిందాల్ ఆ కంపెనీ స్థాపించారు. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ కీలకం: ధన్కర్



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యంలో పాలన అనేది కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారా మాత్రమే సాగుతుందని, న్యాయస్థానాల వల్ల కాదని, ప్రభుత్వమే అంతిమమైం దని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్‌పేర్కొన్నారు. 'నీట్' కేంద్రీకరణపై గతంలో సుప్రీం కోర్టు తీర్పును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రస్తావిం చిన సమయంలో రాజ్యసభ చైర్మన్ పై విధంగా స్పందించారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్‌వీఎన్ సోమూ మాట్లాడుతూ... జాతీయ అర్హత పరీక్ష 'నీట్'ను వికేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. దీనిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తోసిపుచ్చారు. గతంలో దీనిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తా వించిన ఆయన, కేంద్రీకృత విధానాన్ని న్యాయస్థానం కూడా సమర్థించిందన్నారు. ఈ క్రమంలోనే జోక్యం చేసుకున్న చైర్మన్... ప్రజాస్వామ్యంలో పాలన కేవలం కార్యనిర్వాహక వ్యవస్థ ద్వారానే సాగుతుందన్నారు. ఎందుకంటే.. ఎగ్జిక్యూటివ్ అనేది పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుందన్న ఆయన.. ఇది ఇతర ఏజెన్సీల ద్వారా ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, జిల్లా కలెక్టర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆదేశాలతో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జే.ఎల్.బి. హరిప్రియ జిల్లా రెవెన్యూ ఆఫీసర్, ఎల్. రామ్మోహన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కలెక్టర్ కార్యాలయం. టి. ఝాన్సీ రాణి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి, జి. వినోద్ జిల్లా ఎస్.సి. డెవలప్మెంట్ ఆఫీసర్, వి. వేంకటేశ్వర్లు డిస్ట్రిక్ట్ ట్రెజర్ ఆఫీసర్ మరియు వి. వెంకట నర్సయ్య, అధ్యక్షులు, మేడ్చల్ జిల్లా కల్లుగీతా కార్మిక సంఘం, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, ప్రతినిధులు మరియు వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జలమండలి ఉద్యోగులు పదవీ విరమణ

విశాలాంధ్ర , హైదరాబాద్ : జలమండలిలో 10 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. బోర్డులో వివిధ స్థాయిల్లో పని చేస్తూ రిటైర్ అయిన వీరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాల్ని చెక్కు రూపంలో అందజేశారు. పదవీ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో నాణ్యమైన సమయం గడపాలని, జీవితం సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీ అండ్ ఏ సీజీఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడు తాయన్నారు. ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు పరశురాం రెడ్డి, అంజయ్య, జెఏసి వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్, చిన్న యాదవ్, సతీష్, గంగాధర్ కృష్ణ, శ్రీనివాస్, గణేష్, సత్యనారాయణ, లింగమన్న, సుధాకర్, జనార్ధన్, కోటేష్, రవీందర్, వేణు యాదవ్, రాజేష్ గౌడ్, శ్రవణ్ యాదవ్, రజని గౌడ్, కోటేశ్వర, రాములు, సంకురి సాయి, రాము, నటరాజ్, సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర , హైదరాబాద్ : బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గం చందా నగర్‌లోని జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్ నందు శేరిలింగంపల్లి శాసన సభ్యులు అరికే పూడి గాంధీ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గంలో సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని, ప్రజా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డ్ కలిగిన లబ్ధిదారులు అందరూ సన్న బియ్యంతో సంతృప్తిగా భోజనం చేయాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ సన్న బియ్యం పథకం ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి మనిషికి 6 కేజీలు చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం.బి.సి. ఛైర్మన్ జయపాల్ యాదవ్, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.శ్రీనివాస్, సివిల్ సప్లయ్ మేనేజర్ గోపీకృష్ణ, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో ఇంటి నిర్మాణం: మహర్షి

విశాలాంధ్ర మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గం, నేరేడ్మెట్ డివిజన్ ఆర్కేపురంలోని శక్తి నగర్ లో సర్వే నెంబర్ 211లోని సుమారు 2000గజాల స్థలంలో తప్పుడు పత్రాలతో నిర్మాణ అనుమతులు ఇచ్చారని బాధితులు జిహెచ్ఎంసి అధికారులపై మండిపడ్డారు. 1984లో తాము సర్వే 211 నంబర్లు లో 2000గజాల స్థలాన్ని కొనుక్కున్నామని, కొందరు వ్యక్తులు ఇట్టి స్థలంపై తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారని, డాక్యుమెంట్లో ఒక ఇంటి నెంబర్ పొందుపరిచి మరో ఇంటి నెంబర్‌పై అనుమతులు తీసుకున్నారని, జిహెచ్ఎంసి జోనల్ అధికారులు ఎలాంటి విచారణ జరపకుండా అనుమతులు ఇచ్చారని బాధితుడు మహర్షి (73) మండిపడ్డారు. ఇంటి అనుమతులు జారీ చేయడంలో భారీ కుంభకోణం జరిగిందని దీనిపై తక్షణమే విచారణ జరిపించి అనుమతులు రద్దు చేయాలని జోనల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని బాధితులు మండిపడ్డారు. జిహెచ్ఎంసి అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ ఫిర్యాదుపై విచారణ జరపాలని, ఎలాంటి విచారణ జరపకుండా అనుమతులు జారీ చేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హెచ్‌సియు నుంచి భూమి తీసుకోలేదు : మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించింది కాదని, హెచ్సీయూలో నుంచి ఒక్క సెంటు భూమిని కూడా తీసుకోలేదు అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ పార్టీలు విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నాయని, వారి వలలో పడవద్దని విద్యార్థులకు హితవు పలికారు. 20 ఏండ్లుగా న్యాయ వివాదంలో ఉన్న కంచ భూముల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, వాటిని కాపాడేందుకు అప్పుడు ఎందుకు ప్రయత్నాలు చేయలేదని ప్రశ్నించారు. ఆ భూములను కాజేసేందుకు ప్రైవేట్ వ్యక్తులకు కొమ్ముకాసేలా వ్యవహరించారని, అందుకే గతంలో నోరు మెదపలేదని చెప్పారు. పాత్రదారులు, సూత్రదారులు ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు. ఎంతో విలువైన కంచ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం కాకుండా సీయం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం న్యాయస్థానాల ముందు బలమైన వాదనలు వినిపించిందని, ఈ నేపథ్యంలోనే ఆ భూములు ప్రభుత్వానికి దక్కాయని పేర్కొన్నారు. అప్పుడు ప్రయివేట్ కంపెనీకి 400 ఎకరాలు వెళ్తే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది అనిపించలేదని, ఆ భూములు ఇప్పుడు ప్రభుత్వం పరమైతే గగ్గోలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడం,ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం, రాష్ట్ర ఆదాయం పెరిగేలా కంచ భూములను టీజీఐఐసీకి అప్పగించిందని, హైటెక్ సీటీ, ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ తరహాలో ఆ ప్రాంతంలో సంస్థలను నెలకొల్పి రాష్ట్రానికి మేలు జరిగేలా చూస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో రూ. 31 వేల కోట్ల విలువైన 453 ఎకరాల ప్రభుత్వ భూములను అమ్మిందని, అప్పుడు ఇల్లు గుల్ల చేసి, ఇప్పుడు పెడబొబ్బలు పెడుతుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ కంపనీలకు ధారదత్తం చేసిందని, ఇప్పుడు అదే బీజేపీ నేతలు తెలంగాణలో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో గత పదేళ్లల్లో 16 లక్షల ఎకరాల అడవిని నాశనం చేసిన అధికార బీజేపీకి కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై మాట్లాడే నైతిక హక్కు ఉందా? అని ప్రశ్నించారు. 10 లక్షల మందితో బీఆర్ఎస్ పార్టీ మీటింగ్ పెడుతామని చెప్పుతోందని, దాని నిర్వహణకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలన్నారు. ఇంత సంపద ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్ కౌశిక్, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదు : వేముల

విశాలాంధ్ర - హైదరాబాద్ : శాంతియుతంగా నిరసనకు దిగిన హెచ్‌సియూ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజాపాలన పేరిట రేవంత్ సర్కార్ అణిచివేతలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులపై రేవంత్ సర్కార్ నిర్బంధకాండ కొనసాగిస్తుంది. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన.రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపాడుతా అంటూ రాజ్యాంగం చేతులో పట్టుకొని దేశం మొత్తం తిరుగుతున్నాడు. హెచ్ సియులో జరుగుతున్న భూముల అమ్మకాలు రాహుల్ గాంధీకి కనపడటం లేదా? ఎన్నికలప్పుడు హెచ్ సియుకి వచ్చిన రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి ఎం మాట్లాడారు. అలాగే గతంలో ప్రభుత్వ భూముల అమ్మకంపై రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఏంటి. ఇప్పుడు వారు వ్యవహరిస్తున్న తీరు ఏంటి ? రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అదానీ, అంబానీలకు భూములు అమ్ముతాం అంటే చూస్తూ ఊరుకోమన్నారు. హెచ్ సియు అడవుల్లో అనేక జీవ జాతులు ఉన్నాయి. పక్షులు ఉన్నాయి అవి ప్రభుత్వం చర్యలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయనీ పర్యావరణ వేత్తలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మీరెన్ని నిర్బంధ కాండలు కొనసాగించిన, లాఠీ చార్జీలు చేసిన పెద్దలకు దోచిపెట్టే మీ చర్యలను అడ్డుకోవడానికి విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ తీవ్రంగా ఖండిస్తున్నాం : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర , హైదరాబాద్ : బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్, రాజ్ బహదూర్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ... రాష్టంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ భూముల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలి. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురి విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం అంటూ ఒక వైపు చెబుతూ, మరోవైపు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుంది. విద్యార్థి హక్కులను కాలరాస్తూ... వారి స్వేచ్ఛను హరించే ప్రక్రియ చేపట్టింది. అమ్మకం పెట్టిన భూమిని యూనివర్సిటీ అవసరాల కోసం ఉపయోగించాలని, భవిష్యత్ విద్యార్థి అవసరాల కోసం, పరిశోధనల కోసం, ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేయాలి కానీ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేదానికోసం కాదని ప్రభుత్వాన్ని నిలదీయడం జరిగింది. యూనివర్సిటీ మొత్తం పోలీసుల వలయంలో చిక్కుకున్నది. తక్షణమే పోలీస్ బలగాలను వెంటనే వెనక్కి పిలవాలని, జెసిబిలు, బుల్డోజర్లు వెనక్కి వెళ్లిపోవాలని, ప్రభుత్వ భూమిని వెంటనే యూనివర్సిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, అరుణ్, హరీష్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేష్, శ్రావణి, ఆకాష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళి

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : సిపిఐ అనుబంధ ప్రజా సంఘాలు ఎస్.ఏ. డాంగే భవన్ లో , బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఉడుతల మల్లేష్ అధ్యక్షతన, బహుజనుల నాయకుడు సర్వాయి పాపన్న వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొడ్డుపల్లి కృష్ణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలోన దక్కన్ పీఠభూమిలో మొగలాయి పాలకులు ఆక్రమించుకున్న తెలంగాణ ప్రాంతాల నుంచి విముక్తి చేయడానికి, దౌర్జన్యాలను అరాచకాలను తిప్పి కొట్టడానికి, మొట్టమొదటి సైన్యాన్ని ఏర్పాటు చేసిన బహుజన తిరుగుబాటు నాయకుడు సర్వాయి పాపన్న, విరోచితమైన , పోరాటపాటిమతో ముందుకు సాగిన గొప్ప బహుజన నేత సర్వాయి పాపన్నఅని

కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బి.అఖిల్, పి.మల్లేష్ ,కే.రవి, జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ చర్యలు తీసుకోకపోతే చూస్తూ ఉండాల్సిందేనా? : సుప్రీంకోర్టు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. బీఆరెస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల బీఆర్ఎస్ నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవని, ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుందన్నారు. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే అని, ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. '2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు అని కోర్టుకు తెలిపారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి : సీపీఐ

విశాలాంధ్ర కాప్రా : ఉప్పల్ చౌరస్తా జిహెచ్ఎంసి కార్యాలయానికి ఆనుకుని ఉన్న బస్టాప్‌లో జిల్లా సర్వీస్, సిటీ బస్సుల రద్దీ కారణంగా నిత్యం ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ ట్రాఫిక్ జోన్ 1 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ మల్లారెడ్డికి సీపీఐ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లిసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్.బోస్, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి కార్యాలయానికి ఆనుకుని ఉన్న బస్టాప్‌లో జిల్లా సర్వీస్ మరియు సిటీ బస్సుల రద్దీ కారణంగా రోజూ వందలాది బస్సులు ఆగడం వలన నిత్యం ఈ రోడ్డు ద్వారా ప్రయాణం చేసే సాధారణ ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతున్నారని వారు అన్నారు. ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం, పాలక అధికార యంత్రాంగం ఈ ట్రాఫిక్ సమస్యపై నిర్లక్ష్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన చర్చించాలని, ప్రభుత్వ రంగ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా స్థలాన్ని ఉపయోగించి జిల్లా సర్వీస్ బస్సులను ఇక్కడ నుండే నడిపేలా చొరవ తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ అంశంపై త్వరలో సీపీఐ ఆధ్వర్యంలో రాజకీయ పోరాటం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, సీపీఐ ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు జంగా రెడ్డి,రాజేంద్ర ప్రసాద్, సబ్బు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేపట్టండి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : అంబర్ పేట పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 30 పడగల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం అంబర్పేట్ ఎంసిహెచ్ కాలనీలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలు కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలతో ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయి. బాగున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, ఇంజక్షన్ రూమ్ కరకి చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఐదు కోట్ల రూపాయలే వ్యయంతో నూతనంగా నిర్మించిన 30 పడగల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆవరణలో ఉన్న చెట్లను వేరే చోటికి తరలించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ను సూచించారు. ఆస్పత్రి ప్రక్కన గల భవన యజమానులు ఆస్పత్రి ఆవరణలో చెత్త వేసే వారిపై పెనాల్టీ వేయాలని, వినకపోతే క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులు ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న ఆసియన్ ప్లాంట్ పనిచేసేలా చూడాలని డి సిహెచ్ ఎస్‌ను ఆదేశించారు. ఆసుపత్రికి కావలసిన పరికరాల గురించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డి సి హెచ్ ఎస్ రాజేందర్, ఆర్డీవో రామకృష్ణ, డిఈఈ జగదీష్ ప్రసాద్, శివ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ దక్షిని, రేంజ్ ఆఫీసర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం ఏసీ బస్ షెల్టర్లు తనిఖీలు

విశాలాంధ్ర , హైదరాబాద్ : ఏసిలు , ఫ్యాన్లు బాగు చేయాలని మార్చి మొదటి వారం నుండి పలు దఫాలుగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అన్ని చోట్ల రిపేర్లు అవ్వలేదని పలు కంప్లయింట్లు వచ్చినందువల్ల గత సోమవారం ప్రత్యేక టీంతో తనిఖీ చేయగా కొన్ని ఏజెన్సీలు అన్ని రిపేర్లు చేయలేదని తెలిసింది. అందుకు గాను యూని యాడ్స్‌కి రూ. 22,000 , ప్రకాష్ ఆర్ట్స్‌కి రూ. 30,000, మీడియా కార్ట్ కి రూ. 30,000, పెనాల్టీ వేయడం జరిగింది. మళ్లీ ఈ రోజు అనగా మంగళవారం తనిఖీ చేయగా ఇంకా పలుచోట్ల ఏసిలు పని చేయలేదని తెలిసింది అందుకు గాను మళ్ళీ యూని యాడ్స్ కి రూ. 46,000, ప్రకాష్ ఆర్ట్స్ కి రూ. 61 ,000, మీడియా కార్ట్ కి రూ. 56 ,000, పెనాల్టీ వేయడం జరిగింది. సోమవారం మళ్లీ తనిఖీలు చేయడం జరుగుతుందని అన్ని రిపేర్లు పూర్తి చేయనిచో మరింత పెనాల్టీలు విధించబడునన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏఐసిసి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈ రోజు మహబూబ్ నగర్ పట్టణంలోని 11,25 వ వార్డులో నిర్వహించిన జై బాపు , జై భీం, జై సంవిధాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రాజ్యాంగం మార్చాలనే కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ మార్చితే మైనారిటీలు హక్కులను కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలందరినీ చైతన్య పరుస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్న గౌడ్

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్న గౌడ్ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వర్ధంతిని పురస్కరించుకుని మహబూబ్ నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ లోని గ్రీన్ ఫీల్డ్‌లో గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యుడు కూడా సంకల్పం ఉంటే చక్రవర్తి కావచ్చు అని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మొగల్ చక్రవర్తులను ఎదిరించి రుజువు చేశారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇస్తున్న నిజమైన నివాళి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అజ్మత్ అలి, ప్రవీణ్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తిరుమల వెంకటేష్, ఖాజా పాషా, రాషెద్ ఖాన్, మోసిన్, అంజద్, నాయకులు కిషన్ నాయక్, అర్షద్ అలి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఆర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ వర్ధంతి బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తిని నరసింహా గౌడ్ అధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల కొరకు సర్వాయి పాపన్న చేసిన పోరాటం గురించి మరియు గోల్కొండ ఖిలా ను ఏలిన ఒక గీతా కార్మికుడి గా వివిధ కోటలను అక్రమించి బహుజనులకు రాజ్యాధికారం ఇచ్చిన గొప్ప నాయకుడుగా, ఇన్ని సంవత్సరాలు అయినా ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకునే భాగ్యం మనందరికీ దక్కినందుకు గర్వంగా ఉందని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నరసయ్య, అంబాల శ్రీనివాస్ గౌడ్, కోళ్ల ఈశ్వర్ ప్రసాద్ , టి.ఎన్. కృష్ణా గౌడ్, సిద్దులు గౌడ్, వాసగొని శ్రీనివాస్ గౌడ్, పిట్టల్ భాస్కర్, రామ్మోహన్ కురుమ,రవీందర్ గౌడ్, పిట్టల శ్రీనివాస్ , అజయ్ గౌడ్, సుదర్శన్ గౌడ్, నరహరి గౌడ్, శ్రీకాంత్ గౌడ్, గోల్డ్ మెన్ సతీష్ గౌడ్, కామేశ్వర్ గౌడ్, నగేష్ యాదవ్,బాలరాజు పాల్గొన్నారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో

విశాలాంధ్ర , హైదరాబాద్ : బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని బి.సి.సంక్షేమ శాఖ కార్యాలయంలో బి. సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. డిఆర్ఓ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ వీరుడు, తెలంగాణ ప్రజల ఆత్మగౌరం. తెలంగాణలో మొగలాయి విస్తరణను తొలిసారిగా అడ్డుకున్నది సర్దార్ సర్వాయి పాపన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి.కేశురాం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు పి. రమేష్, వై. మాధవ రెడ్డి, కుల సంఘం నేతలు బోయపల్లి సుధాకర్ గౌడ్, నర్సింహ గౌడ్, బండి రాజు గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన డిప్యూటీ కమిషనర్‌ని కలసిన హమీద్ పటేల్

విశాలాంధ్ర శేరిలింగంపలి: శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం నందు, నూతన డిప్యూటీ కమిషనర్‌గా నియమితులైన వి.ప్రశాంతిని, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ గారు మర్యాద పూర్వకంగా కలసి, మొక్కను బహుకరించి, అభినందనలు తెలియజేశారు.

పోరాట యోధుడు పాపన్న గౌడ్

విశాలాంధ్ర - అమనగల్లు : బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ అని తాలుక గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజి గౌడ్ అన్నారు.ఆమనగల్లు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో 315వ వర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం గౌడ సంఘం అధ్యక్షులు చుక్క అల్లాజిగౌడ్, స్థానిక గౌడ సంఘం నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 400 ఏళ్లు దాటిన ఆయన పేరు తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. తెలంగాణ బహుజన ప్రజానీకానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని,మొగలాయిల అరాచకాలనుఎదిరించి, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు పాపన్న గౌడ్ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాలూక ఉపాధ్యక్షుడు గంగా రవి, టౌన్ ప్రెసిడెంట్ గజ్జ వెంకటయ్య గౌడ్, యువజన అధ్యక్షుడు గుండ్రాతి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జ రాఘవేందర్ గౌడ్, నాయకులు అల్లాజీ, నరసింహ,శివ, వెంకటేష్, అంజి, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈ నెల 6న జరిగే సీతారాముల కళ్యాణం ప్రశాంత్ నగర్ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ సేవా సమితి, ఆధ్వర్యంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుని ఆహ్వానించడం జరిగింది. దీనిలో భాగంగా కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, లక్ష్మీకాంతరెడ్డి, సంపత్ గౌడ్, మదన్ మోహన్, జోషి, నారాయణ, అనిల్ కుమార్, ప్రశాంత్ కుమార్, బిందు రాజ్, చక్రవర్తి పంతులు, చందు తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ సాధ్యమని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు.రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 7, 8,9 డివిజన్లలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని, అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నగేష్ చారి, మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ జీవన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిర , మధుసూదన్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చౌదరి, ప్రవీణ్, కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, జగన్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రవి, నాని, వర్మ రాజు, రమేష్, మల్లికార్జున్, గంగాధర్, శ్రీనివాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-దుండిగల్: అండర్ గ్రౌండ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తండా 27 వార్డ్‌లో రూ.35లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను బుధవారం మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ దశబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోని తాండలను ఎంతో అభివృద్ధి పరిచామని, ఈ ఒక్క డ్రైనేజీతో తాండ 2కి ఉన్న సమస్య తీరుతుందని, మరో కోటి 50లక్షల రూపాయల పనులు టెండర్ దశలో ఉన్నాయని, త్వరలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆశభావం వ్యక్తం చేశారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P. 578/2022
Between:
Ruttala Varahalu & 2 others ...Petitioners
And
Pitla Praneeth & 3 others ...Respondents
NOTICE
To,
R-2: Adigarla Hari Babu, S/o. Gangaraju, Hindu, aged not known but Major, R/at D.No.14-3-118-1, Joshiwadi Begambazar, Hyderabad, Telangana State.
R-3: Rajat Saini S/o. Ome Prakesh Saini, Hindu, aged not known but Major, R/at Goshamahal, Hyderabad, Telangana State.
Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against both of you and other respondents for claiming compensation and the matter stands posted to **15-04-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **15-04-2025** at **10:30 A.M.** in the above Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
B. RAMA GOPALA RAJU, Ch. GEETHA, Advocates
Narsipatnam, Anakapalli District.

గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి : పద్మావతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ పేటలో ఓ మహిళపై అత్యంత కిరాతకంగా, రాక్షసంగా గ్యాంగ్ రేప్ పాల్పడిన తొమ్మిది మంది కామాంధులను తక్షణమే కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి డిమాండ్ చేశారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఆధ్వర్యంలో విచక్షణ రహిత సామూహిక అత్యాచారాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఊరుకొండ పేటలో జరిగిన సామూహిక హత్యాచారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో మహిళ పట్ల అంత దారుణానికి ఒడిగట్టిన నిందితులు ఇంతకు ముందు కూడా ఇలాంటి సంఘటనలు జరిగినట్లు వార్తలు వస్తున్నాయని అన్నారు. ఆలయ ఉద్యోగి,మిగతా 9 మంది కలిసి మహిళ పట్ల ఇంత అమానవీయంగా దారుణానికి ఒడిగట్టారని వాపోయారు. బాధితురాలు దాహం వేస్తుంది అని వేడుకున్నా నోట్లో మూత్రం విసర్జించారు అంటే వారి క్రూరత్వానికి అర్థం పడుతున్నదని మండిపడ్డారు. ఇలాంటి కిరాతకులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనలో ఇంకా ఎవరెవరికి సంబంధం ఉందో విచారించి మానవ కామ మృగాలను ఏ ఒక్కరిని కూడా వదలొద్దని కోరారు.ఆడపిల్లలు ఒంటరిగా బయటికి వెళ్లాలి అంటేనే భయపడే స్థితి దాపురిస్తుందని అన్నారు. కామాంధుల చేతిలో బలైపోయిన మహిళని ఆ సమయంలో అక్కడేం పని అని కొంతమంది నిందిస్తున్నారని, కానీ మరి ఆ రాత్రి పూట అక్కడ కిరాతకులకు ఏం పని అని ఎవరు ప్రశ్నించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కామాంధుల దుశ్చర్యలను ఎన్ఎఫ్ఐడబ్ల్యు తీవ్రంగా ఖండిస్తోందని, నిందితులని వెంటనే కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళలకు సత్వరం న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మాధవి, సత్యమ్మ, సింధు, లక్ష్మీ కళ, వరలక్ష్మీ,పద్మ, జ్యోతి, మణెమ్మ, అనన్య, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏలో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలి :ఏఐవైఎఫ్

విశాలాంధ్ర -కాప్రా : ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల టిక్కెట్ల విషయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్ఓ) నిర్వాహకులు మధ్య విబేధాలు తారాస్థాయికి చేరాయని, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును తీరు సిగ్గు చేటు అని, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న జగన్మోహన్‌రావును అధ్యక్ష పదవి నుంచి తొలగించి, కేసు నమోదు చేయాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ హెచ్‌సిఎ తీరుపై గతంలోనే ప్రత్యక్ష పోరాటాలు చేశామని, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో అలసత్వం కారణంగానే ఇప్పుడు బాహాటంగా ఆరోపణలు వాస్తవమనే అంశం తెరమీదకు వచ్చిందన్నారు. మరల ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సిన పాలకవర్గం, అదే పాలక వర్గ అనుబంధ సంఘాలు నేడు ఉప్పల్ స్టేడియం ముందు ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. క్రీడా స్ఫూర్తికి అనుగుణంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ వ్యవహరించడం లేదని, టికెట్లను అమ్ముకుంటున్నారని, అతని వైఖరి వలన వేరే ప్రాంతానికి ఐపీఎల్ మ్యాచ్ లను తరలిస్తామని సన్ రైజర్స్ చెబుతుందన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) నిర్వాహకులు మాత్రం టికెట్లను బ్లాక్ చేసి బ్లాక్ మార్కెట్ ద్వారా అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్‌ల మధ్య సమన్వయం కొరవడిందని వారు ధ్వజమెత్తారు. ఉప్పల్ స్టేడియంలో నాణ్యమైన ఆహార పదార్థాలను అమ్మడం లేదని ధ్వజమెత్తారు. రెగ్యులర్ స్టాండ్లలో ఫుడ్ స్టాల్స్‌లో ఏది కొనాలన్నా రెట్టింపు ధరలను చెల్లిస్తున్నారన్నారు. స్టేడియంలో ధరలు షాకింగ్ గా ఉన్నాయని అభిమానులు వాపోతున్నారన్నారు. ఉప్పల్ స్టేడియంలో అధిక ధరలను కట్టడి చేయడంలో వినియోగదారుల ఫోరమ్ తనిఖీలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. హెచ్ సీఏ బోర్డ్ యంత్రాంగం నాణ్యమైన ఆహారం, కూల్ డ్రింక్స్ అమ్మకుండా క్రీడా ప్రేక్షకుల జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. అందుకే హెచ్‌సీఏ బోర్డు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమానులు ఐపీఎల్ టిక్కెట్ల విక్రయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ టిక్కెట్లను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

హైడ్రా నిద్ర పోతుందా : సుధాకర్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గత కొద్ది రోజులుగా సెంట్రల్ యునివర్సిటీ కంచ గచ్చిబౌలి లో 400 ఎకరాలు కబ్జా కు గురి అవుతుంటే రాష్ట్రం లో చెరువులు కాపాడుతానని ప్రతిజ్ఞ బూనిన హైడ్రా రంగనాద్ ఏం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుదాకర్ ప్రశ్నించారు. కోట్లాది రూపాయల విలువైన ఈ 400 ఎకరాలలో అడవితోపాటు 3 చెరువులు పీకాక్ లేక్, బఫెల్లో లేకే, క్రేన్ లేక్ లు వున్నాయని, అంటే ఈ నలుగు వందల ఎకరాలు బఫర్ జోన్ లోకి వస్తాయని, అంగుళం స్తలం కూడా బఫర్ జోన్ లో వుంటే వదలం అని చెప్పే రంగనాద్ ఏం చేస్తున్నారని డాక్టర్ దిడ్డి సుదాకర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేసారు. అనేక రకాల జంతువులకు, పక్షులకు నిలయమైన ఈ భూములపై ప్రభుత్వం బెషజాలకు పోకుండా తక్షణం, హెచ్.సి.యు విద్యార్ధి సంఘాల నాయకులతోపాటు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయమై చర్చించి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు. కాంక్రీట్ నగరం గా మారిపోతున్న హైదరాబాద్ మహా నగరం లో ఆక్సిజన్ అందిస్తున్న పెద్ద పార్కు ను నష్ట పరచకుండా, ఇపుడు ప్రభుత్వం ప్రతిష్టాకరం గా ప్రకటించిన వేల ఎకరాలలో నిర్మించ దలచిన ఫ్యూచర్ సిటీలో ఈ ఐటి హబ్ ని నిర్మించాలని కోరారు. ప్రభుత్వం కాదని హెచ్.సియు భూములను ఆక్రమిస్తామని, నిర్మాణం చేస్తామని మొండి పట్టు పడితే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వుంటుంది అని డాక్టర్ దిడ్డి సుదాకర్ హెచ్చరించారు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

విశాలాంధ్ర శేరిలింగంపలి: బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఏంటీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , గౌడ సోదరులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం అసమానం. మొట్టమొదటి బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి , బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం అని పీఏసీ చైర్మన్ గాంధీ కొనియాడారు. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి రాజకీయ, సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండ ఏలిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవితం అసమానం అని గాంధీ కొనియాడారు. ఈ కార్యక్రమంలోశేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పుట్ట వినయ్ కుమార్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లీలానంద గౌడ్, కోశాధికారి నిమ్మల ధాత్రినాథ్ గౌడ్, గౌడ సంఘం ప్రముఖులు పి అశోక్ గౌడ్, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, నిమ్మల ఆనంద్ గౌడ్, మూల అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

విశాలాంధ్ర శేరిలింగంపలి: తెలంగాణ తొలిరాజు,బహుజన రాజ్యాధికారి, పోరాట యోధుడు,మొగులయి దౌర్జన్యాలను ఎదిరించి తెలంగాణ ప్రాంతాని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రాంగణంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కృషిని,పోషించిన చారిత్రక పాత్రను స్మరించుకున్నారు,సబ్బండ వర్గాలకు రాజకీయ,సామాజిక సమానత్వం కోసం పాపన్న గారు చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని,కుల,మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాడడం గొప్ప విషయమన్నారు..తెలంగాణ స్వయం పాలనలో సబ్బండ వర్గాలకు రాజకీయ అధికారంలో భాగస్వామ్యం లభించిందని,స్వరాష్ట్రంలో వేలాది మంది దళిత,బహుజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడం ద్వారా పాపన్నగౌడ్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ,కేంద్రాల్లో/రాష్ట్రంలో అమలు చేస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ గౌస్,శేఖర్ ముదిరాజ్, గిరి తదితరులు పాల్గొన్నారు..

ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌కి వాయుసేన గ్రీన్ సిగ్నల్ : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ప్రజలతో పాటు, తెలంగాణ ప్రజలందరికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయతలపెట్టిన పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన అంగీకారం తెలిపినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు మామునూర్ ఎయిర్ పోర్టుకు అనుమతులు సాధించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు.. భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు సాధించడంపట్ల ఆయన హర్షంవ్యక్తం చేశారు. ఆరు నెలల స్వల్పవ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు సాధించడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు (లేఖ సంఖ్య: 5608/ఎయిర్ పోర్ట్స్/2024, తేదీ: 18.12.2024) భారత వాయుసేన వాయుసేన అధికారులు సముఖతవ్యక్తం చేయడంతో పాటు అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిటెయిల్డ్ ప్రపోజల్స్ ను భారత వాయుసేనకు సమర్పించాలని కోరినందున అందుకు సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులతో సమీక్షిస్తున్నామని అతిత్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను రూపొందించి కేంద్రానికి, సంబంధిత విభాగాలకు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. తెలంగాణలో మొన్న మామునూర్, బుధవారం ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులకు అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి, రాష్ట్రంలో ఏయిర్ పోర్ట్ ల ఏర్పాటుకు అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ఆసుపత్రి సీజ్.. రూ.5 లక్షల జరిమానా

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్ - మల్కాజిగిరి : అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా సేవలు చేయడం, అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడం, అర్హత లేని సిబ్బందిని నియమించడం, అధిక శక్తి కలిగిన వైద్య మాత్రలు వినియోగం, అనధికార వైద్య చికిత్సలు, లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బందిని నియమించుకోకుండా వైద్య సేవలను అందిస్తున్న చెంగిచెర్లలోని భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్ పై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా అధికారి డా.సి.ఉమా గౌరీ తీవ్రమైన చర్యలు తీసుకున్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.గీతా, అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.వినోద్ తో పాటు రెవెన్యూ శాఖ, పోలీసు అధికారుల సమక్షంలో బుధవారం హాస్పిటల్‌లో నియమా నిభంధనలు పాటించకుండా చికిత్సలు చేయడాన్ని వారు గుర్తించారు. దీంతో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఆసుపత్రి యాజమాన్యానికి రూ.5,00,000 జరిమానా విధించారు. అదనంగా, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ 60 రోజులపాటు తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. అలాగే, హాస్పిటల్ మేనేజ్మెంట్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసందుకు ఆదేశాలు జారీ చేశారు. హాస్పిటల్ ప్రాంగణాన్ని తక్షణమే స్వాధీనం చేసుకుని, అనధికార వైద్య పద్ధతులు కొనసాగించకుండా అన్ని వైద్య పరికరాలు మరియు డయగ్నోస్టిక్ ఉపకరణాలు జప్తు చేశారు.

సన్న బియ్యం పంపిణీ

విశాలాంధ్ర -మొయినాబాద్: సన్న బియ్యం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్దార్నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనకమామిడి గ్రామంలో రేషన్ లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అప్పట్లో దొడ్డు బియ్యం ఇస్తే వాడుకునే పరిస్థితి ఉండేది.. కాదని సన్నబియ్యంతో పేదల ఆకలి తీరుతుందన్నారు. సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మర్రి రవిందర్రెడ్డి మాజీ సర్పంచ్లు జనార్ధన్రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఆలూరి రాములు, డీలర్ అనంతరెడ్డి రేషన్కార్డు లబ్దిదారులు పాల్గొన్నారు.

సమాజ హితంగా పనిచేయాలి

విశాలాంధ్ర- మొయినాబాద్: వ్యక్తి నిర్మాణం.. సమాజ హితం కోసం పనిచేయాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పాలమూరు విభాగ్ సంయోజక్ గూడెం రమేష్ పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్, భజ్ రంగ్ దళ్ అధ్వర్యంలో మెయినాబాద్ మండల భజరంగ్‌దళ్ నూతన కమిటీని బుధవారం ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడెం రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యక్తి నిర్మాణం.. సమాజ హితం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అందరూ ఐక్యంగా ఉండాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మ పరిరక్షణకు పనిచేయాలని సూచించారు. దేశ రక్షణలో ప్రతి ఒక్కరూ బాగస్వాముల వ్వాలని సూచించారు. భజరంగ్ దళ్ మండల సంయోజక్(అధ్యక్షుని)గా విజయ్ పాండు, సహ సంయోజాక్ శ్రీధర్, శ్రావణ్, విద్యార్థి ప్రముఖ్ గా సాయికోటి, నితిన్, బిందు కిరణ్, సురక్ష ప్రముఖ్ శివకుమార్, బలోపాసన ప్రముఖ్ శివయాదవ్, సాప్తాహిక్ మిలన్ ప్రముఖ్ భరత్ యాదవ్, గోరక్ష ప్రముఖ్ నరేందర్ రెడ్డి, శ్రీనివాస్లను మండల నూతన కమిటీలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భజ్ రంగ్ దళ్ అనంతగిరి జిల్లా సహ ప్రముఖ్ రమేష్ చారి, విశ్వహిందూ పరిషత్ గో సురక్ష ప్రముఖ్ కాసుల సురేష్ గౌడ్, మండల పూర్వపు భజ్ రంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గాంధీ. అంబేద్కర్, సంత్ సేవాలాల్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర- అమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలో ఈనెల 3 గురువారం ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పర్యటించడం జరుగుతుందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. చరికొండ గ్రామపంచా యతీ పరిధిలోని బోయిన గుట్ట తండాలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా లు రానున్నట్లు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ లాల్కోట భరతమ్మ నరసింహ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ శివ తదితరులు ఉన్నారు.

జలమండలికి వరల్డ్ వాటర్ అవార్డు

విశాలాంధ్ర , హైదరాబాద్ : జలమండలిని వరల్డ్ వాటర్ అవార్డు వరించింది. వాటర్ డైజెస్ట్ అనే ప్రముఖ అంతర్జాతీయ సంస్థ 2024-2025 సంవత్సరానికి వరల్డ్ వాటర్ అవార్డ్స్ లో జలమండలికి గవర్నమెంట్ కేటగిరీలో ఉత్తమ ఎస్టీపీ అవార్డు లభించింది. యునెస్కో భాగస్వామ్యంతో నిర్వహించిన 19వ వాటర్ డైజెస్ట్ వరల్డ్ వాటర్ అవార్డ్స్ (2024-2025) సంవత్సరానికి ఎస్టీపీ/ మురుగు నీటి శుద్ధి అవార్డు లభించింది. ఈ అవార్డును జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్ ప్రధాన కార్యాలయంలోని మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్ లో ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ లకు బుధవారం అందజేశారు. ఈ అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో అందరికీ తాగు నీరు అందించడంతో పాటు.. ఉత్పన్నమయ్యే మురుగును శుద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాగోల్ 320 ఎమ్మెల్డిల ఎస్టీపీ పర్యావరణ అనుకూలత, సమర్థవంతమైన మురుగు నీటి శుద్ధి మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విశేష ప్రాముఖ్యతను చూపినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. మురుగు శుద్ధి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం, సమాజానికి పరిశుభ్రమైన.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.అలాగే అధునాతన నీటి నిర్వహణ, సర్క్యులార్ ఎకానమీ విధానాలు, మురుగు నీటి పునర్వినియోగం వంటి అంశాలలో చేసిన కృషికి ఈ గుర్తింపు లభించింది. నాగోల్ ఎస్టీపీ మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో పెద్ద ప్లాంట్ ప్రసిద్ధి చెందింది.చాదర్ ఘాట్ నుంచి ప్రారంభమయే మురుగు నీరు.. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఎన్నో నాలలను కలుపుకుంటూ నాగోల్ వద్దకు చేరుకుంటుంది. ఇక్కడ నిర్మించిన ప్లాంట్ ద్వారా నిత్యం 320 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదులుతున్నారు. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం మార్చ్ 31న డిల్లీలో జరిగింది. జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్-I సుదర్శన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎస్టీపీ సీజీఎంలు పద్మజ, సుజాత, జీఎం కుమార్, డీజీఎం నిరుపమ మేనేజర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్ రాయితీ గడుగు పొడిగింపు

విశాలాంధ్ర, హైదరాబాద్ : లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎస్ఆర్ఎస్) రాయితీ గడువును ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ జీ.ఓ 182ను బుధవారం జారీ చేశారు. నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎస్ఆర్ఎస్ ఫీజును 25% రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు 25,67,107 రాగా 20,00,495 దరఖాస్తులకు ఫీజు చెల్లింపు కోసం నోటీసులు జారీ చేశారు. 4,58,680 మంది ఫీజు చెల్లించారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ అవశ్యం

- దుష్టపాలనే భారత్‌కు ప్రధాన సమస్య
- సమష్టి పోరాటాలతోనే ఫాసిజాన్ని ఓడించగలం
- సీపీఎం జాతీయ మహాసభల్లో డి.రాజా

మధురై: పుట్టుకలో అంతా సమానమైనప్పటికీ నేడు దేశంలో సంస్థాగతంగా అసమానతలు రాజ్యమేలుతున్నాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. వ్యవస్థీకృత దోపిడీ, వివక్షపై సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం 24వ జాతీయ మహాసభలు బుధవారం తమిళనాడు రాష్ట్రం మధురైలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నేత మాణిక్ సర్కార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజా పాల్గొన్నారు. ఆయన ముందుగా విప్లవాభివాదాలు తెలిపారు. కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాలకు అరుణ పతాకం ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. వలసవాదం, ఫెడరలిజం, కుల రక్కసి, దోపిడీ రాజ్యం నుంచి విమోచనం కోసం పోరాడిన కమ్యూనిస్టు యోధులకు విప్లవాంజలి ఘటించారు. కమ్యూనిస్టుల పునరేకీకరణకు పిలుపునిచ్చారు. సంఘటిత పోరాటాలతోనే ఫాసిజాన్ని జయించగలమని నొక్కిచెప్పారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ దోపిడీ రాజ్యం, దుష్పరిపాలన భారత్‌కు పెద్ద సవాల్‌గా మారిందని, దేశ ప్రజల వెతలకు కారణమవుతున్నట్లు రాజా వక్కాణించారు. కులం, వర్గం, పితృస్వామ్యం నేపంతో కిరాతక అణచివేత ఆక్షేపణీయమన్నారు. మన దేశం నేడు తీవ్ర ఒత్తిడికి లోనవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితులు కమ్యూనిస్టుల పునరేకీకరణకు డిమాండ్ చేస్తున్నాయని... కార్పొరేట్-మతోన్మాదంపై నిర్ణయాత్మక పోరాటానికిగాను కమ్యూనిస్టులు, లెఫ్ట్ సైద్ధాంతిక ఐక్యత అత్యవసరమని నొక్కిచెప్పారు. కలిసికట్టుగా గొంతు లేని వారి గొంతుక అవుదాం, అసంఘటిత వర్గాన్ని సంఘటితపరుద్దాం... ఆశలు కోల్పోయిన బతుకుల్లో ఆశలు నింపుదాం అని రాజా పిలుపునిచ్చారు. దేశ సంపద ఒక శాతం కోటీశ్వరుల చేతుల్లో బందీ అయిందని, ధనికులకు, పేదలకు మధ్య వ్యత్యాసం అంతకంతకూ పెరుగుతుండటం సిగ్గు చేటని విమర్శించారు. దేశ జనాభాలో సగం మందికి రెండు పూటల భోజనం దొరకని దీన పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ స్థాయిలో కార్మికులు, కర్షాకుల దుర్భర పరిస్థితులకు ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ విధానాలే కారణమన్నారు. సామ్రాజ్యవాదం పెరిగిపోతుండటం, నాటో రెచ్చిపోతుండటం, ఉక్రెయిన్‌లో యుద్ధంతో అంతర్జాతీయ సుస్థిరత దెబ్బతినడం, కార్మిక వర్గం తమ రక్తంతో మూల్యం చెల్లించుకోవడం, పెట్టుబడిదారీ రాజ్యాల మద్దతుతో గాజాలో మారణహోమం కొనసాగుతుండటం, మానవ హక్కులు అతిక్రమణకు గురి కావడం, యుద్ధ నేరాలు పెరగడం వంటివి తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలని రాజా నొక్కిచెప్పారు. 'సామ్రాజ్యవాదం అంటే యుద్ధం' అన్న లెనిన్ మాటలను గుర్తుచేసుకోవడం సందర్భోచితమని, నేడు సామ్రాజ్యవాదం మన కళ్ల ఎదుట కనిపిస్తోందన్నారు. పర్యావరణం సంక్షోభంలో ఉన్నప్పటికీ పెట్టుబడిదారులు ప్రకృతిని దోచుకోవడాన్ని ఆపడం లేదని, మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లేలా చేస్తున్నారని రాజా విమర్శించారు. మతోన్మాదం, మతతత్వవాదం పేట్రేగిపోతోందని, సమాజం విభజనకు గురవుతోందని, ప్రజల్లో గందరగోళం నెలకొంటోందని, శ్రామిక వర్గం అచేతనంగా మిగిలిపోతోందని, దోపిడీ వ్యవస్థను కూలద్రోయాలన్న మన నిజమైన లక్ష్యం నుంచి దృష్టి మరలిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని రాజా అసహనం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టుల పునరేకీకరణ అత్యవసరమన్నారు. వీధుల్లో, ఫ్యాక్టరీల్లో, గ్రామాల్లో, యూనివర్సిటీల్లో ఉద్యమాలు, పోరాటాలకు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. కుల వ్యవస్థను పెకిలివేయాలన్నారు. ఆర్థిక దోపిడీని అరికట్టాలన్నారు. 'జై భీమ్, ఇంక్విలాబ్ జిందాబాద్, లాల్ సలామ్' నినాదాలతో స్ఫూర్తి పొందాలని, పరివర్తనా ఉద్యమానికి సిద్ధం కావాలని, ఇది ప్రతి కామ్రేడ్‌కు విప్లవాత్మక కర్తవ్యమని రాజా నొక్కిచెప్పారు. విద్య, ప్రజారోగ్యం, ఉపాధి, ఆహార భద్రత, సామాజిక భద్రత పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇవి సంక్షేమ డిమాండ్లు మాత్రమే కాదు మానవుల గౌరవ జీవనానికి, సామాజిక న్యాయానికి అస్త్రాలని వక్కాణించారు. ప్రతి ఒక్కరికి విద్య, విజ్ఞానం అందడం- సాంకేతిక సమానత్వం లభించడం అవసరమని, సైన్స్ కమాడిఫికేషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశ పరిస్థితులు ఘోరంగా మారిన నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవడం కోసం సంకోచించడానికి సమయం లేదని నొక్కిచెప్పారు. విప్లవాలు, ఉద్యమాల నిర్మాణం దిశగా ముందుకు సాగాలని రాజా పిలుపునిచ్చారు. 'ఉద్యమించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వారి నమ్మకాన్ని మనం పొందాలి. భవిష్యత్ దృష్ట్యా ప్రతిఘటన, ఆకాంక్షల ఆశాలకు చిహ్నంగా అరుణ పతాకాన్ని ఉవ్వెత్తున ఎగురవేద్దామ'ని రాజా పిలుపునిచ్చారు. ఐక్యపోరాటాలతోనే ముందుకు వెళ్లగలమన్నారు. సీపీఎం మహాసభలు విజయవంతం కావాలని ఆంక్షిస్తూ లాల్ సలామ్ నినాదంతో తన ప్రసంగాన్ని రాజా ముగించారు. అనంతరం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు సిద్ధాంతంతో ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు అజెండా వ్యతిరేక పోరాటం స్థిరంగా సాగుతోందన్నారు. మరింత ఐక్యత, సమన్వయంతో కమ్యూనిస్టు వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం ద్వారా ఫాసిస్టు శక్తుల పని పట్టగలమని వక్కాణించారు.

పెంచిన పాల ధరను ఉపసంహరించాలి

పాల ఫ్యాక్టరీ వద్ద సీపీఐ శ్రేణుల నిరసన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : విజయ డెయిరీ పాల ధరను లీటరుకు రూ.2 పెంచి సామాన్యులపై భారం వేయడాన్ని నిరసిస్తూ సీపీఐ పోరుబాట పట్టింది. బుధవారం సీపీఐ నగర సమితి అధ్వర్యంలో విజయవాడలోని విజయ పాల ఫ్యాక్టరీ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ వందల కోట్ల రూపాయల లాభాల్లో ఉన్న సంస్థ ఎందుకు ప్రజలపై భారాలు వేయటానికి సిద్ధమైందో చెప్పాలని నిలదీశారు. ఈ నిర్ణయాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా తప్పుపడుతుందని తెలిపారు. వినియోగదారులపై భారం వేయడం సరికాదని, వచ్చిన లాభాలతో ఉత్పత్తులను పెంచడం, పాల సేకరణ పెంచడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని సూచించారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెంన్నాయుడు స్పందించి సంస్థను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు డి.వి. రమణబాబు, తూనం వీరయ్య, కె.నాగేశ్వర రావు, సింగరాజు సాంబశివరావు, డివిజన్ కార్యదర్శులు కుర్ర శివయ్య, ఆర్.మైకేల్, కె.వెంకటేశ్వరరావు, బోరా రామకృష్ణ, పగిడికత్తుల రాము, మురుగేషన్ రాము, బెవర శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు కంచర్ల భార్గవ్, సభ్యులు శ్రీరామ్ రవి, యేసు, పిఎన్‌ఎంఎస్ కె నజీర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయి కుమార్, అమీర్, సిద్ధిక్, మారుతి, సూరిబాబు, యలమంద, రామారావు, ఓర్సు భారతి, చింతాడ పార్వతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర రైతు సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను నిరసిస్తూ ఈ నెల 15, 16, 17 తేదీలలో తమిళనాడులోని నాగపట్నంలో జరగునున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)జాతీయ మహాసభలను పురస్కరించుకుని స్థానిక హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం రాష్ట్ర రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు హాజరవుతారని పేర్కొన్నారు.

టీటీడీ సంపూర్ణ ప్రక్షాళన

- ఏ స్థాయిలోనూ మినహాయింపులుండవు
- సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు
- అభివృద్ధి పనుల పేరుతో డబ్బులు దుర్వినియోగం కారాదు
- సమీక్షలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని, భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అలాగే టీటీడీ నూరుశాతం ప్రక్షాళన జరగాల్సిందేనని, దీనికి ఏ స్థాయిలోనూ మినహాయింపులుండకూడదని స్పష్టం చేశారు. టీటీడీపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమగ్రంగా సమీక్ష చేశారు. భక్తులకు అందించే సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై సీఎం మార్గనిర్దేశనం చేశారు. తిరుమల దేవాలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి నేటికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే ఆ మార్పు 100 శాతం ఉండాలి. అప్పుడే భక్తుల, ప్రజల అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి. మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమలకు టీటీడీ ఖర్చు చేస్తోంది..దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్ తో పాటు....కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే వితరణ, విరాళాలు ప్రతి రూపాయి సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం, జవాబు దారీతనం ఉండాలని సీఎం స్పష్టం చేశారు.

అలిపిరిలో బేస్ క్యాంప్

సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని, రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించగా, దీనిని మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సీవీఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా...వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టర్లలో విస్తరించి ఉండగా....ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

అనుబంధ ఆలయాల అభివృద్ధి

అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. చుట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కొయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

అమరావతి రాజధానికి సహకారం

సింగపూర్ ప్రతినిధుల బృందంతో సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించి గతంలో మాదిరిగానే సింగపూర్ ప్రభుత్వం..రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజ్ఞప్తి చేశారు. సింగపూర్ ప్రతినిధుల బృందంతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఆర్డీఏ, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి సమావేశమై అనేక అంశాలను చర్చించారు. 2014-2019లో అమరావతి ప్రజా రాజధాని నిర్మాణానికి సింగపూర్ ప్రభుత్వం ఒక కీలక భాగస్వామిగా ఉందని, అదే స్థితిని ప్రస్తుతం కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే అమరావతి రాజధానికి సంబంధించి కేంద్ర నిధులతో పాటు ప్రపంచ బ్యాంకు,హడ్ కో,ఎడిబి వంటి సంస్థలతో పెద్దఎత్తున నిధులు టైఅప్ చేసిందని నిధులకు ఎలాంటి సమస్య లేదన్నారు. ఈనెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతి రాజధాని నిర్మణ పనులను పున:ప్రారంభించేందుకు రానున్నారని సీఎస్ తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ మాట్లాడుతూ అమరావతి రాజధానిని శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. అంతకు ముందు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 217 చ.కి.మీల విస్తీర్ణంతో అమరావతి ప్రజా రాజధానిని నిర్మించేందుకు ఈ ప్రభుత్వం తిరిగి శరవేగంగా అడుగులు వేస్తోందన్నారు. దానిలో భాగంగానే అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్సు, అనేక ట్రంక్ రోడ్ల నిర్మాణం,ఇతర నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు సంబంధించిన పనులకు పెద్దఎత్తున నిధులు సమీకరించి పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని వివరించారు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధి ఫ్రాన్సిస్ చోంగ్ మాట్లాడుతూ గతంలో తరహాగా అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన భాగస్వామ్యాన్ని తిరిగి పునరుద్ధరిం చేందుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు అన్నివిధాలా కృషి చేస్తామన్నారు. అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెట్ సీఎండీ లక్ష్మీసారథి, సీఆర్డీఏ అదనపు కమిషనర్లు ప్రవీణ్ చంద్, నవీన్, సింగపూర్ ప్రతినిధులు ఆడ్రే టాన్, ఎలీజా ఆంగ్, నాజ్నీ బేగం, వివేక్ రఘురామన్, డేన్సి టాన్, వైష్ణవి, వాసుదేవన్ పాల్గొన్నారు.

అమరావతి ప్రజా రాజధాని నిర్మాణ పనులను పున:ప్రారంభిం చడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తి స్థాయిలో ఏర్పాట్లపై సమీక్షిస్తామని, సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, ఐజీ హఫీజ్ అరీఫ్, సీఆర్డీఏ అదనపు కమీషనర్లు ప్రవీణ్ చంద్, నవీన్, వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ పాల్గొన్నారు. వర్చువల్‌గా డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశా, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

మీడియా స్థితిగతుల అధ్యయనం కోసం

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి: ఐజేయూ

చెన్నై: మీడియా రంగంలో ప్రవేశిస్తున్న తాజా సాంకేతిక మార్పులను దృష్టిలో ఉంచుకుని మీడియా స్థితిగతుల అధ్యయనం కోసం తక్షణం మీడియా కమి షన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు అభిప్రాయ పడ్డారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) రెండురోజుల జాతీయ కార్యవర్గ సమా వేశం చెన్నై వేపేరి లోని వైఎంసీఏ మినీ ఆడిటో రియంలో బుధవారం ప్రారంభమైంది. ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మీడియాలో కృత్రిమమేధ వంటి నూతన సాంకేతికత ప్రవేశిస్తున్న నేపథ్యంలో మీడియా రంగం పనిలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నా యన్నారు. సోషల్ మీడియా విస్తరించడంతో మీడియా పనితీరుపై దాని ప్రభావం కూడా పెరిగిందని...మీడియా పనిలో, వర్కింగ్ జర్నలిస్టుల పని పరిస్థితుల్లో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. మారిన పరిస్థితుల్లో మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్న తమ చిరకాల డిమాండ్ కు మరింత ప్రాధాన్యం ఏర్పడింద న్నారు. దీనిపై ఐజేయూ జాతీయ కార్యవర్గ సమావేశాలలో చర్చిస్తున్నామని తెలిపారు. దీనిపై పౌర సమాజంలో కూడా చర్చ జరగాలని విజ్ఞప్తి చేశారు. డీఎంకే సీనియర్ నేత ఇలంగోవన్ మాట్లాడుతూ ప్రజలకు సరైన సమాచారాన్నిచ్చి , వారిలో చైతన్యాన్ని, అవగాహనను పెంపొందించ డానికి మీడియా స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా కమిషన్ ను ఏర్పాటు చేయాలని ఇలంగోవన్ డిమాండ్ చేశారు. బీజేపీ సీనియర్ నేత తొంభై ఎనిమిదేళ్ల డా.హెచ్. వి. హండే , అన్నా డీఎంకే ప్రచార కమిటీ డిప్యూటీ కార్యదర్శి, ప్రముఖ సినీ నటి గౌతమి, సీనియర్ పాత్రికేయుడు, ఆప్ తమిళనాడు శాఖ కన్వీనర్ వశీకరన్, ది హిందూ ఎంప్లాయిస్ యూనియన్ పూర్వాధ్యక్షుడు గోపాల్, తమిళ ప్రముఖుడు తనింద్రన్, ఐజేయూ సెక్రెటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ , ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్. సిన్హా , దేవులపల్లి అమర్ , ఎంఏ మాజిద్ తదితరులు మాట్లాడారు. తమిళనాడు జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షులు సుభాష్ వక్తలను వేదిక పైకి ఆహ్వానించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్ స్వాగతోపన్యాసం చేశారు. ఇటీవల కన్నుమూసిన పాత్రికేయులకు సమావేశం తొలుత సంతాపం ప్రకటించింది. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి జాతీయ కార్యదర్శులు వై. నరేందర్ రెడ్డి, డి.సోమసుందర్ , జాతీయ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, నగునూరి శేఖర్, డా.ఎం.ప్రసాద్ , తెలంగాణా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కే విరాహత్ అలీ , ప్రధాన కార్యదర్శి కే. రాం నారాయణ్ , మోతె వెంకటరెడ్డి పాల్గొన్నారు.

15 లోగా ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 12 నుంచి 15 మధ్య విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. ఆరోతేదీ నాటికి మూల్యాంకన ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత జరగాల్సిన కంప్యూటరీకరణ కోసం దాదాపు ఐదు లేదా ఆరు రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్ని ఆయా తేదీల్లోగా విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. ఈసారి ఫలితాలను కొత్త విధానంలో విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో ఫలితాలను ప్రకటించడం జరుగుతోంది. ఈసారి మరింత సులభతరం చేసేందుకు వాట్సాప్ ద్వారా ఫలితాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ప్రతి విద్యార్థి మార్కులను పీడీఎఫ్ రూపంలో తయారు చేసి, వాట్సాప్ ద్వారా పంపనున్నారు. పీడీఎఫ్ డాక్యుమెంట్లు షార్ట్ మెమోలుగా ఉపయోగపడేలా తీర్చిదిద్దారు. గతంలో ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన తర్వాత షార్ట్ మెమోలను వేరుగా విడుదల చేసే విధానం ఉండేది. ఈసారి ఫలితాల ప్రకటనే వాట్సాప్ ద్వారా జరుగుతుండటంతో, విద్యార్థులకు తక్షణ ఫలితాలు అందే విధంగా ప్రతిదీ పీడీఎఫ్ రూపంలో అందించనున్నారు. ఈ కొత్త విధానం విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరింత సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఈఏపీసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలకు షెడ్యూలు వచ్చింది. ఈ పరీక్షల ప్రక్రియ పూర్తయ్యే ముందునాటికే ఇంటర్ ఫలితాల విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఫలితాలు వచ్చిన నెల రోజుల్లోగా విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్ష, బెటర్‌మెంట్ పరీక్షలను నిర్వహిస్తారు. ఈఏపీసెట్‌కు ఇంటర్ మార్కుల వెయిటేజీ ఇవ్వడంతో... అందరూ మార్కుల శాతం పెంపుదలపై దృష్టి పెట్టారు.

ఎయిమ్స్‌లో వసతులు పెంచాలి

నిర్మలా సీతారామన్‌తో భేటీలో పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఎయిమ్స్ సామర్థ్యాన్ని పెంచేలా 1,054 పోస్టుల భర్తీతో పాటు మౌలిక సదుపాయాలు సముచితంగా కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం దిల్లీల కార్యాలయంలో సీతారామన్‌ను కలిశారు. ఏపీ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఎయిమ్స్ ప్రధాన భూమిక పోషిస్తుందని, విజయవాడ-గుంటూరు పరిధిలో నిర్మితమైన ఈ ఆసుపత్రి రెండు జిల్లాల ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి, వైద్య విధానంపై సిబ్బంది, సదుపాయాల కొరత ప్రభావం ఉందన్నారు. 105 ఫ్యాకల్టీ పోస్టులు, సీనియర్ రెసిడెంట్ పోస్టులు, జూనియర్ రెసిడెంట్ పోస్టులు, నర్సింగ్ కేడర్ పోస్టులు, నాన్-ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ఆమోదించిన 960 పడకలను అందుబాటులోకి తేవాలన్నారు. తమ ప్రతిపాదనను అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరగా అనుమతులు మంజూరు చేయాలని పెమ్మసాని కోరారు. సీతారామన్ సానుకూలంగా స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి కేంద్రంతో పాటు రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వాలు సహకరిస్తాయన్నారు. నిర్మలా సీతారామన్‌తో భేటీ అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ తన ప్రయత్నం ఫలిస్తే ఎయిమ్స్‌కు అయ్యే ఖర్చులో ఏటా సుమారు రూ.250 కోట్లను కేంద్ర ప్రభుత్వం అదనంగా భరిస్తుందని అన్నారు.

ప్రలోభాలకు తలొగ్గొద్దు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వ ప్రలోభాలు, బెదిరింపులకు... పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తలొగ్గవద్దని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఉపఎన్నికల్లో అడుగడుగునా అధికార పార్టీ అరాచకాలు, పోలీసుల అండతో అక్రమాలకు పాల్పడిందని, సంఖ్యా బలం లేకపోయినా పోటీకి దిగారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్ బుధవారం సమావేశమయ్యారు. చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కి చేరాయని, దిక్కుమాలిన అబద్ధాలు, మోసాలతో రాష్ట్రంలో పాలన చేస్తున్నాడని జగన్ ధ్వజమెత్తారు. పీ-4 అని కొత్త మోసం తీసుకొచ్చాడని, సమాజంలో ఉన్న 20శాతం పేదవారి బాగోగులు అన్నింటినీ 10 శాతం సంపన్నులకు అప్పగిస్తాడంట అని విమర్శించారు. రాజకీయాలలో విలువలు, విశ్వసనీయత ఉండాలని గట్టిగా నమ్మిన వ్యక్తిని నేనని, మీరు చూపించిన తెగువకు, స్ఫూర్తికి హేట్సాఫ్ అంటూ అభినందించారు. ఇటీవల జిల్లా పరిషత్, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ సభ్యులు, ఉప సర్పంచ్ స్థానాలు కలిపి దాదాపు 57 చోట్ల ఉప ఎన్నికలు జరిగితే ఏడు చోట్ల అధికార పార్టీకి గెలిచే పరిస్థితి లేక ఎన్నికలు వాయిదా వేశారన్నారు. మరో 50 చోట్ల వాయిదా వేసే పరిస్థితి లేకపోవడంతో ఎన్నికలు జరిపారని, 39 చోట్ల వైసీపీ కార్యకర్తలు గొప్పగా తెగింపు చూపించి గెలిచారన్నారు. సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్‌లు ఎక్కడికి పోయాయని, పాఠశాలలు నాశనం అయిపోయాయని, ఇంగ్లీషు మీడియం గాలికెగిరిపోయిందని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ లేదని, పారదర్శకత, స్కీములూ లేవని, ఉన్నదల్లా రెడ్ బుక్ రాజ్యాంగమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ భూముల విక్రయాన్ని విరమించండి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైదరాబాద్ సెంట్రల్ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో 400 ఎకరాల భూములను వేలం ద్వారా విక్రయించే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్‌జీ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్సిటీలో భూములను చదును చేస్తున్న జేసీబీలను అడ్డుకుని..భూములు రక్షించుకునేందుకుగాను వెళ్తున్న విద్యార్థులను పోలీసులు ఇష్టానుసారంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజా పాలనలో విద్యార్థులపై ఉక్కు పాదం మోపడం ఏమిటని, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల భూముల విక్రయాలపై మొండిపట్టుకు పోకుండా ఉన్నతమైన ప్రమాణాలు, పరిశోధనలతో, నాణ్యమైన విద్యతో దక్షిణ భారతదేశంలో హైదరాబాద్ విశ్వ విద్యాలయం ప్రత్యేకమైన గుర్తింపు పొందిందని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని రీసెర్చ్ సెంటర్లు, ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాల భూమి అవసరం ఉంటుందని, వర్సిటీ భూముల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద విద్యాశాఖను పెట్టుకుని... విశ్వవిద్యాలయ భూములు విక్రయించడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. వర్సిటీలో వందలాది పోలీసులతో పాలన చేయడం దుర్మార్గమని అన్నారు.

వక్ఫ్ ఆస్తుల అద్దెల సవరణకు రెంట్ రివ్యూ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముస్లింలకు ఉచిత విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డు ద్వారా నూతన పథకాన్ని ప్రారంభిస్తున్నామని, అతి త్వరలో దాని వివరాలు తెలియజేస్తామని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో బుధవారం అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 3వ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండాలోని అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. మేనేజింగ్ కమిటీలు, ముతవల్లీల నియామకం చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల అద్దెల సవరణకు రెంట్ రివ్యూ కమిటీని నియమించామని తెలిపారు. 2025-26 నుంచి 2027-28 సంవత్సరాలకు గాను డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న 933 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లీజుకు ఇవ్వనున్నామన్నారు. రాష్ట్రంలో వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగపడే వక్ఫ్ భూములను అభివృద్ధి చేయడానికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి డెవలపర్లను, సంస్థలను, పారిశ్రామిక వేత్తలను దీర్ఘకాలిక లీజు లేదా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ భూములపై సౌర విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య కాంప్లెక్సులు, విద్యా సంస్థలు, హాస్పిటల్‌లు, ఇతర వాణిజ్య ప్రాజెక్టులు అభివృద్ధి చేసే అవకాశం ఉందని వివరించారు. సమావేశంలో బోర్డు సభ్యులు, శాసన మండలి సభ్యులు మొహమ్మద్ రుహుల్లా, శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్, సభ్యులు ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, దావూద్ భాషా బఖావి, బేపారి జాకీర్ అహమద్, సీఈవో మొహమ్మద్ అలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.